



జనగామ మునిసిపల్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేస్తున్న కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియను వేగవంతం చేయాలి

కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

జనగామ రూరల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ఎల్‌ఆర్‌ఎస్ క్రమబద్ధీకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. మంగళవారం జనగామ మునిసిపల్ కార్యాలయాన్ని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారుల ప్లాట్‌ల క్రమబద్ధీకరణ ఆన్‌లైన్ విధానాన్ని నిశితంగా పర్యవేక్షించాలని సిబ్బందికి సూచనలు చేశారు. రాజీవ్ యువ వికాసం పథకంలో స్వీకరించిన దరఖాస్తులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ గడువును ఈ నెల 30 వరకు పొడగించడం జరిగిందన్నారు. రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా దరఖాస్తు చేసుకునే లబ్ధిదారులకు రేషన్ కార్డు ఉంటే ఆదాయ ధృవీకరణ ప్రతం అవసరం లేదన్నారు. కలెక్టర్ వెంట మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, డీఎస్సీడీవో విక్రమ్, బీసీ సంక్షేమ అధికారి రవీందర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఎస్‌ఏ-2 పరీక్షలు

జనగామ కల్చరల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): సమ్మెటీవ్ అసెస్‌మెంట్ (ఎస్‌ఏ-2) పరీక్షలు ఈనెల 9 నుంచి నిర్వహిస్తున్నట్లు జనగామ డీఈవో ఎం.రమేశ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అన్ని యాజమాన్యాల పరిధిలో ఈ నెల 9వ తేదీ నుంచి 6 - 9వ తరగతి విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, 11వ తేదీ నుంచి 1 - 5వ తరగతి విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి 11.30 గంటల వరకు వరకు ఎస్‌ఏ-2 పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లా ఉమ్మడి పరీక్షల విభాగం ద్వారా ప్రశ్నాపత్రాలను పాఠశాలల వారీగా అందజే శామని, టైంటేబుల్ ఆధారంగా ఆధారంగా పరీక్షలు నిర్వహించాలన్నారు. పరీక్షల నిర్వహణలో నిబంధనలు అతిక్రమించినట్లయితే క్రమశిక్షణ చర్యలు తప్పవన్నారు. ఏ రోజుకు ఆరోజు జవాబుపత్రాలను మదింపు చేసి సంబంధిత విద్యార్థుల ప్రగతి నమోదు రిజిస్టర్లలో నమోదు చేయాలని, అదే విధంగా ఐఎస్‌ఎంఎస్ పోర్టల్‌లో కూడా నమోదు చేయాలన్నారు. ఈ నెల 23న జరిగే తల్లిదండ్రుల సమావేశంలో విద్యార్థుల ప్రగతి నమోదు పత్రాలను పంపిణీ చేయాలని, విద్యార్థుల ప్రగతిపై తల్లిదండ్రులతో సమీక్ష నిర్వహించాలని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సూచించారు.



డీపీవో స్వరూపకు సమ్మె నోటీసును అందిస్తున్న యూనియన్ నాయకులు

మా బతుకులు బాగుపడేదెన్నడు ?

పంచాయతీ కార్మికుల వేతన వెతలు!

- 5 నెలలుగా డబ్బులు లేక ఇబ్బందులు
- మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దుకు డిమాండ్
- ఈనెల 19 తర్వాత సమ్మెకు దిగనున్న కార్మికులు

జనగామ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి):పారిశుధ్య పనుల్లో జీపీ కార్మికుల పాత్ర ఎంతో కీలకం. అయినా వారి బతుకులు మాత్రం దుర్భరం.. ఉదయం లేచింది మొదలు సాయంత్రం వరకు డ్రెయినేజీ, వీధులు శుభ్రం చేయడం, ఇంటి పన్నులు, నల్లా పన్నులు వసూలు చేయడం, వీధిలైట్లు , ఇంకా అధికారులు చెప్పిన పనులు చేయడంలో వారు నిత్యం బిజీగా ఉంటారు. అయినప్పటికీ వారికి సరైన సమయంలో వేతనాలు అందక సతమతమవుతున్నారు.

ఐదు నెలలుగా..

రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న సుమారు 62 వేల మంది కార్మికులు వేతనాలు రాక నానా వెతలు పడుతున్నారు. వారికి 5 నెలలుగా, కొందరికి 8 నెలలుగా వేతనాలు లేకపోవడంతో కుటుంబాలు గడవడం కూడా కష్టంగా మారిన పరిస్థితి గత ఏడాదిలో పెండింగ్‌లో ఉన్న వేతనాలను విడుదల చేయకపోవడం, జనవరి నుంచి నేరుగా ఖాతాల్లో జీతాలు వేస్తామన్న ప్రకటనను ప్రభుత్వం నిలబెట్టుకోకపోవడంతో పంచాయతీ కార్మికులు భగ్గుమంటున్నారు. తమ డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని, లేని పక్షంలో నిరవధిక దీక్షకు దిగుతామని హెచ్చరించారు. ఇదే క్రమంలో జనగామ జిల్లాలో తెలంగాణ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో జిల్లా పంచాయతీ అధికారికి గురువారం సమ్మె నోటీసు అందించారు.

'మల్టీపర్పస్' రద్దుకు డిమాండ్

రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీ కార్మికుల వేతనాలు విడుదల కాకపోవడం, గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని పంచాయతీ కార్మికులు, యూనియన్లు డిమాండ్ చేస్తున్నాయి. బీఆర్ఎస్ హయాంలో పంచాయతీ కార్మికులందరిని మల్టీపర్పస్ వర్కర్లుగా పేర్కొంటూ జీవో నంబర్ 51ను తీసుకొచ్చింది. గతంలో గ్రామంలోని సఫాయి, వాటర్ మెన్, కారోబార్, ఎలక్ట్రీషియన్, డ్రైవర్ ఎవరి పని వారు చేసేవారు. దీని వల్ల వారికి గ్రామంలో ప్రత్యేక గుర్తింపు ఉండేది. కానీ మల్టీపర్పస్ విధానం ప్రకారం కార్మికులందరూ అన్ని పనులు చేయాలని ప్రభుత్వం అప్పట్లో ఆదేశించింది. దీంతో వారికి గుర్తింపు లేకుండా పోయింది. ఈ నెల 19 వరకు మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, పెండింగ్‌లో ఉన్న వేతనాలను నేరుగా ఖాతాల్లో జమ చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. లేనిపక్షంలో 19 తర్వాత నిరవధిక దీక్షకు దిగుతామని తెలుపుతున్నారు.

రూపాయి ఖర్చు లేకుండా రద్దు చేయొచ్చు



గ్రామంలో కేటగిరీల వారిగా ఉన్న పంచాయతీ కార్మికులను గత బీఆర్ఎస్ హయాంలో మల్టీపర్పస్ వర్కర్ విధానం ద్వారా ఒకే గొడుగు కిందకు తెచ్చారు. సఫాయి, కారోబార్, ఎలక్ట్రీషియన్, వాటర్‌మెన్ ఇలా ఎవరి పనుల్లో వారు ఏళ్ల తరబడి చేస్తున్న వారిని అన్ని పనులు చేయాలని జీవో తెచ్చారు. దీని వల్ల కార్మికులకు సరైన గుర్తింపు లేకుండా పోయింది. 5 నెలలుగా పంచాయతీ కార్మికుల వేతనాలు రావడం లేదు. వీటిని వెంటనే కార్మికులు ఖాతాల్లో వేయాలి. లేని పక్షంలో ఈనెల 19 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతాం.

\- రాపర్తి రాజు, గౌరవ అధ్యక్షుడు, జిల్లా పంచాయతీ వర్కర్స్ యూనియన్

5 నెలలుగా వేతనాలు బంద్

జిల్లావ్యాప్తంగా 12 మండలాల పరిధిలో 281 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఈ గ్రామ పంచాయతీల పరిధిలో 1460 మంది కార్మికులు పనిచేస్తున్నారు. వీరితో సఫాయి, ఎలక్ట్రీషియన్, కారోబార్, వాటర్‌మెన్ వంటి వారు ఉంటారు. యూనియన్ నేతలు చెబుతున్న ప్రకారం 1460 మంది ఉండగా అధికారుల లెక్కల్లో మాత్రం 1209 గా ఉన్నారు. వీరిలో చాలా మందికి గత ఏడాది నవంబరు నెల నుంచి ఇప్పటి వరకు జీతాలు పడలేదు. ఐదు నెలలుగా జీతాలు పడకపోవడంతో కార్మికులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ కార్మికుల్లో ఎక్కువగా పేదలే ఉంటారు. వీరికి ఐదు నెలలుగా వేతనాలు అందకపోవడంతో కుటుంబం గడవడం కూడా కష్టంగా మారింది. గత ఏడాది నవంబరు, డిసెంబరు వేతనాలు గ్రామ పంచాయతీల ఖాతాల నుంచి కార్మికులు ఇవ్వాల్సి ఉండగా చెక్కులు రాసి పంపినా ఖజానా శాఖలో క్లియర్ కాకపోవడంతో వేతనాలు ఆగిపోయాయి.

'నేరుగా వేతనం' అమలు కాలేదు

గ్రామ పంచాయతీల్లో పనిచేసే కార్మికులకు గ్రామ పంచాయతీల ద్వారా వేతనాలు అందించేవారు. గ్రామ పంచాయతీల ఖాతాల నుంచి సర్పంచి, కార్యదర్శి డ్రా చేసి వేతనాలు ఇచ్చేవారు. ఈ క్రమంలో తక్కువ మొత్తంలో ఇవ్వడం, నెలలు గడిచినా ఇవ్వకపోవడం వంటి సంఘటన చోటుచేసుకున్నాయి. కార్యదర్శి ఎప్పుడు జీతం ఇస్తే అప్పుడే తీసుకోవాల్సిన పరిస్థితి ఉండేది. పంచాయతీల్లో నిధులు లేకపోవడానికి కారణంగా చూపుతూ కార్మికులకు వేతనాలు ఇవ్వడంలో జాప్యం చేసేవారు. దీనికి చెక్ పెట్టేందుకు గానూ ప్రభుత్వం ఈ ఏడాది జనవరి నుంచి నేరుగా కార్మికుల ఖాతాల్లోనే జీతాలు వేయాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించి డిసెంబరు నెలలోనే జిల్లాలోని పంచాయతీ కార్మికుల బ్యాంకు ఖాతా, సర్వీస్ వంటి వివరాలను ప్రభుత్వం సేకరించింది. కాగా.. జనవరి 1న ఖాతాల్లో వేతనాలు పడాల్సి ఉండగా ఏప్రిల్ 1 దాటినా ఇంతవరకూ జమ కావడం లేదు.

దేవునూరు గుట్టల స్థలాన్ని ఆక్రమించలేదు

- నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా..
- నాపై ఆరోపణలు చేసినవారు క్షమాపణలు చెప్పాలి
- స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ టౌన్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ధర్మసాగర్ మండలంలోని దేవునూరు గుట్టల స్థలాన్ని ఆక్రమించి 2వేల ఎకరాలు కబ్జా చేసినట్లు జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య సత్యదూరమైన ఆరోపణలు చేస్తున్నారని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మండిపడ్డారు. తాను గుంట భూమి కబ్జా చేసినట్లు నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి వారి ఇంటిలో గులాంగిరి చేస్తానని, నిరూపించకపోతే వారు నా ఇంటిలో గులాంగిరి చేయాలని సవాల్ చేశారు. మంగళవారం హనుమకొండ కాంగ్రెస్ కార్యాలయంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. దేవునూరు గుట్టల చుట్టూ ఆరు గ్రామాల పరిధిలో ఫారెస్టు భూమి, అసైన్డ్, పట్టా భూములు ఉన్నాయని తెలిపారు. గతంలో హనుమకొండ కలెక్టర్‌గా పనిచేసిన రాజీవ్ హనుమంతు ఆధ్వర్యంలో రెవెన్యూ, ఫారెస్టు శాఖలు సంయుక్తంగా సర్వే చేసినట్లు తెలిపారు. మొత్తం 3,950 ఎకరాల భూమిలో చేసిన సర్వేలో 3,750 ఎకరాలు మాత్రమే భూమి అటవీశాఖ ఆధీనంలో ఉందని, మిగతా 200 ఎకరాలల్లో అసైన్డ్, పట్టా భూములు ఉన్నట్లు తేలిందన్నారు. ఈ మేరకు అప్పటి అధికారులు హద్దులు కూడా నిర్ధారించినట్లు తెలిపారు. అయితే 1967 నుంచి అటవీశాఖ ఆధీనంలో ఉన్న 43.3 ఎకరాల భూములలో తమ పట్టా, అసైన్డ్ భూములు ఉన్నాయని సుమారు 23 మంది 50 ఏళ్లుగా పంటలు వేసుకుంటే అటవీశాఖ అధికారులు తొలగిస్తున్నారని తెలిపారు. ఈ ప్రాంత ఎమ్మెల్యేగా రైతులకు చెందిన భూమిని రైతులకు అందించాలని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. పట్టా పాస్‌బుక్కులు ఉన్న రైతులకు 2017 నుంచి రైతుబంధు డబ్బులు వస్తున్నాయని అన్నారు. వారి భూమిని వారికి ఇప్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు. మిగతా ఫారెస్టు భూముల్లో ఇటీవల ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో జరిగిన సమీక్ష సమావేశంలో ఏకో టూరిజం డెవలప్‌మెంట్ చేసేందుకు అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. కాగా, 14 ఏళ్ల మంత్రిగా, ఎమ్మెల్యేగా మొత్తం 30 ఏళ్ల తన రాజకీయ జీవితం తెరిచిన పుస్తకమని ఎమ్మెల్యే కడియం పేర్కొన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే అందరికంటే తాను పెద్ద లీడర్‌ను తానేనని తెలిపారు. అందుకే తనను టార్గెట్ చేస్తున్నారని వాపోయారు. తనపై అసత్యపు ఆరోపణలు చేసినందుకు జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్యలు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని, లేకుంటే తాను తీసుకోబోయే చట్టపరమైన చర్యలకు సిద్ధంగా ఉండాలని కడియం హెచ్చరించారు.

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నాయకులు పార్కు స్థలాన్ని కబ్జా చేసి పర్యావరణం గురించి మాట్లాడడం సిగ్గుచేటని విమర్శించారు. ప్రజల కోసం పనిచేస్తున్న తమపై అసత్యపు ఆరోపణలు మానుకోవాలని హితవు పలికారు. గత ప్రభుత్వంలో బీఆర్ఎస్ నాయకులు చేసిన కబ్జాలన్నీ బయటకు తీస్తామని ఎమ్మెల్యే బీఆర్ఎస్ నాయకులను హెచ్చరించారు. 30 ఏళ్లుగా విలువలతో కూడిన రాజకీయాలు చేస్తున్న కడియం శ్రీహరిలాంటి వారిపై బీఆర్ఎస్ నాయకులు ఆరోపణలు చేయడం సిగ్గుచేటని విమర్శించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, ఆర్‌టీఏ మెంబర్ పల్లకొండ సతీష్, కార్పొరేటర్లు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, పాల్గొన్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

కేసీఆర్ పాలనలోనే రైతులకు గౌరవం

- నీటి పంపిణీ విషయంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేల డ్రామాలు
- కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై ఎమ్మెల్యే పల్లా ఫైర్

నర్మెట, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): కేసీఆర్ పాలనలో రైతులకు రైతుబంధు, రైతుబీమా, 24 గంటల విద్యుత్, పంటలకు సాగునీరు అందించి వ్యవసాయాన్ని పండగలా చేసి రైతులకు గౌరవం దక్కిందని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. ఈ నెల 27న నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభ విజయవంతం కోసం మంగళవారం నర్మెట మండల కేంద్రంలోని వినాయక గార్డెన్స్‌లో నర్మెట, తరిగొప్పుల మండలాల బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమం ప్రపంచంలోనే అత్యంత శాంతియుత ఉద్యమమని, అనేక పార్టీలను ఒక చోట చేర్చి ఉద్యమాన్ని నడిపించి నాయకత్వం వహించింది కేసీఆర్ అని పేర్కొన్నారు. కేసీఆర్ పాలనలో రైతులు, అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించి వ్యవసాయాన్ని పండగలా మార్చింది కేసీఆరేనన్నారు. బొమ్మకూరు రిజర్వాయర్ ప్రాంతంలో నీటి కొరతతో పంటలు ఎండిపోయి రైతులు ఇబ్బందులు పడిన ఆ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లిన ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. ఓఎన్‌డీఎం సిబ్బంది 34 రోజులు సమ్మె చేసిన 6 కోట్లు విడుదల చేయలేకపోవడం సిగ్గుచేటన్నారు. ధర్మసాగర్ రిజర్వాయర్ నుంచి నీటి సరాఫరాలో పలు ప్రాంతాలకు అనుసంధానం లేదన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఏడు రిజర్వాయర్‌లో ఉన్నా గండి రామవరం, బొమ్మకూరు, లద్నూరు ప్రాంతాలకు నీటి సరాఫరా కాలేదన్నారు. 2004-14 వరకు కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 40 వేల ఎకరాలకు మాత్రమే సాగునీరు అందిస్తే కేసీఆర్ అధికారంలోకి వచ్చాక 5.14 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు నిధులు కేటాయించారని చెప్పారు. రైతులకు సాగునీరు అందించేందుకు కాంగ్రెస్ చిత్తశుద్ధి లేదన్నారు. కాంగ్రెస్‌లో ఫ్రీ బస్సు తప్ప అంతా తుస్సేనని ఎద్దేవా చేశారు. అదేవిధంగా ప్రతి గ్రామంలో సీనియర్ నాయకులతో జెండాలను ఆవిష్కరించి క్రమశిక్షణతో రజతోత్సవ సభకు వచ్చి సభకు విజయవంతం చేయాలని బీఆర్ఎస్ నాయకులకు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నర్మెట మండల అధ్యక్షుడు చింతకింది సురేష్, తరిగొప్పుల మండల అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి, ఉమ్మడి మండల కన్వీనర్ పెద్ది రాజిరెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గద్దల నర్సింగరావు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఇమ్మడి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ తేజావత్ గోవర్ధన్, మాజీ జడ్పీటీసీ మాలోతు శ్రీనివాస్, మాజీ జడ్పీ కోఆప్షన్ ఎమ్డీ గౌస్, బీఆర్ఎస్ నాయ కులు చిలువేరు లింగం, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



నర్మెటలో రజతోత్సవ సభ సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలి

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎల్.మూర్తి
- ఘనంగా జిల్లా నాలుగో మహాసభలు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఎల్.మూర్తి

జనగామ కల్చరల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశపెట్టదలచిన నూతన విద్యా విధానాన్ని వెంటనే రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్.మూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా నాల్గవ మహాసభలు మంగళవారం జనగామ జిల్లా కేంద్రంలోని విజయ ఫంక్షన్ హాల్‌లో జరిగాయి. ఈ మహాసభలకు ఆర్ఎల్.మూర్తి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని తక్షణమే రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విశ్వ విద్యాల యాల్లో సంస్కరణల పేరుతో యూజీసీ రూపొందించిన ముసాయిదా అమల్లోకి వస్తే విశ్వ విద్యాలయాలు కేంద్ర ప్రభుత్వం గుప్పిట్లోకి వెళతాయన్నారు. రాష్ట్రాల హక్కులను హరించడానికే కేంద్ర ప్రభుత్వం ఈ ముసాయిదా తీసుకువచ్చిందని, దీనిని వెంటనే వెనక్కి తీసుకోవాలని కోరారు. సంక్షేమ హాస్టళ్లలో అనేక సమస్యలు ఉన్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతుందన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైం దన్నారు.

రాబోయే రోజుల్లో సమస్యలు పరిష్కరించని పక్షంలో ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి దామెర కిరణ్, రాష్ట్ర కమిటీ సభ్యులు ధర్మబిక్షం, సందీప్, సుమ, లవ, యాకన్న, ఆర్య, మురళి, రమేష్, కృష్ణ, కీర్తన, హరిత తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో నలుగురు తహసీల్దార్ల బదిలీలు

జనగామ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లాలో నలుగురు తహసీల్దార్లను బదిలీ చేస్తూ కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పాలకుర్తి తహసీల్దార్‌గా పనిచేస్తున్న పొట్టబత్తుల శ్రీనివాస్‌ను జనగామ ఆర్డీవో కార్యాలయ ఏవోగా బదిలీ చేశారు. అదే విధంగా జనగామ ఆర్డీవో కార్యాలయ ఏవోగా పనిచేస్తున్న ఎ.ఆండాలును దేవరుప్పుల తహసీల్దార్‌గా బదిలీపై పంపించారు. దేవరుప్పుల తహసీల్దార్ ఎం.మహిపాల్‌రెడ్డిని తరిగొప్పుల తహసీల్దార్‌గా బదిలీ చేయగా తరిగొప్పుల తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఎం. నాగేశ్వర్‌చారిని పాలకుర్తి తహసీల్దార్‌గా బదిలీ చేశారు.

అవమానభారంతో.. మాజీ సర్పంచ్ భర్త ఆత్మహత్య

కురవి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : అప్పు ల ఊబిలో కూరుకుపోయిన మాజీ సర్పంచ్ కౌసల్య భర్త గుగులోతు కిషన్‌నాయక్ (60) అవమానభారంతో మంగళవారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై సతీష్, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కురవిమండలంలోని కాకులబోడుతండాలో గత స్థానిక సంస్థల ఎన్నికల్లో కిషన్‌నాయక్ తన భార్య కౌసల్యను సర్పంచ్‌గా విజయం సాధించారు. ఈ క్రమంలో కిషన్‌నాయక్‌కు అప్పులు అధికమయ్యాయి. దీంతో అదే తండాలో నివసించే స్వయాన తనబావ హర్యకు 30 గుంటల భూమిని అమ్మి, హద్దులు పెట్టాడు. తన కుమార్తె పెళ్లి కోసం ఉన్న ఆరు ఎకరాల్లో మూడెకరాల భూమిని అమ్మేందుకు నిర్ణయించుకున్నాడు. అయితే హర్య.. ఆయన కుమారుడు సుమన్ తమ భూమిని అమ్మిన తర్వాతే నీ భూమిని అమ్ముకోవాలంటూ.. తరుచూ ఘర్షణ పడేవారు. ఈ నెల 6వ తేదీన తండాలో పెద్దమను షుల సమక్షంలో పంచాయతీని సైతం నిర్వహించారు. ఈ పంచాయతీలో సుమన్ తన మామ కిషన్‌ను దుర్భాషలాడి చెప్పుతో కొట్టాడు. అనంతరం కిషన్ ఇంటికి వెళ్లి ఇంటిముందు ముళ్లకంచె వేశాడు. దీంతో అవమానంగా భావించిన కిషన్‌నాయక్ రెండురోజులుగా ఇంట్లో నుంచి బయటకి రాలేదు. మంగళవారం భార్య కౌసల్య మిర్చి ఏరేందుకు కూలీకి వెళ్లగా, ఇంట్లో ఒంటరిగా ఉన్న కిషన్‌నాయక్ ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. భార్య కౌసల్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై సతీష్ వెల్లడించారు.



బస్సును తొలగిస్తున్న పోలీసులు

ఓఆర్‌ఆర్ బ్రిడ్జి వద్ద బస్సు బోల్తా

- డ్రైవర్‌తో సహా పలువురు ప్రయాణికులకు గాయాలు
- హనుమకొండ జిల్లా చింతగట్టు వద్ద ఘటన

హసన్‌పర్తి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలంలోని చింతగట్టు క్యాంపు ఓఆర్‌ఆర్ బ్రిడ్జి కింద మంగళవారం తెల్లవారుజామున సుమారు 3 గంటలకు ఓ ఆర్టీసీ బస్సు బోల్తా పడింది. దీంతో డ్రైవర్ సహా పలువురికి తీవ్రగాయాలయ్యాయి. కేయూ ఎస్ఐ శ్రీకాంత్, ఇన్‌స్పెక్టర్ సుంకరి రవికుమార్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఆదిలాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ లహరి ఏసీ బస్సు మంగళవారం తెల్లవారు జామున హనుమకొండ బస్టాండ్ నుంచి ప్రయాణికులను ఎక్కించుకొని కరీం నగర్ మీదుగా ఆదిలాబాద్ వెళ్తోంది. ఈ క్రమంలో కరీంనగర్ - హనుమకొండ జాతీయ రహదారిపై చింతగట్టు క్యాంపు ఓఆర్ఆర్ బ్రిడ్జి వద్ద లారీ యూటర్న్ తీసుకుని ఓఆర్‌ఆర్‌పైకి ఎక్కే క్రమంలో లహరి బస్సును ఢీకొట్టింది. దీంతో బస్సు డ్రైవర్ సడన్ బ్రేక్ వేయగా బస్సు బోల్తా పడింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న బత్తుల వెంకటేష్, గంపల శ్రీకాంత్, ఎం.డి.జాకీర్‌హుస్సేన్, వొజ్జ కోటేశ్వర్‌రావు, ఎస్‌కే. మోజీ, కళ్లెం రత్నారాజుతో పాటు ఆర్టీసీ బస్సు డ్రైవర్ మారంపల్లి సుభాష్‌చంద్ర కూడా గాయపడ్డాడు. గాయపడిన వీరిని 108 ద్వారా ఎంజీఎంకు తరలించి చికిత్స అందించారు. లారీ డ్రైవర్ వినోద్ సింగ్‌పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ సుంకరి రవి కుమార్ తెలిపారు. కాగా, కరీంనగర్ - హనుమకొండ ప్రధాన రహదారిపై బస్సు బోల్తాపడడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సుమారు నాలుగు గంటల పాటు వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. దీంతో కేయూ ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలో బస్సును తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

గార్డియన్ హాస్పిటల్ వార్షికోత్సవం

వరంగల్ మెడికల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలోని గార్డియన్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ 15వ వార్షికోత్సవాన్ని మంగళవారం హాస్పిటల్ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ అధినేత, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ కాళీప్రసాద్‌రావు, హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ స్వర్ణలత కేక్ కట్‌చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం డాక్టర్ కాళీప్రసాద్‌రావు మాట్లాడుతూ.. 15 ఏళ్ల నుంచి దిగువ మధ్య తరగతి ప్రజలకు మల్టీస్పెషాలిటీ సేవలు అందిస్తూ మన్ననలు పొందుతున్నట్లు తెలిపారు. తెలంగాణలోనే ఎక్కువ ఆర్థోపెడిక్ సర్జరీలు చేసిన ఘనత గార్డియన్ హాస్పిటల్‌కు దక్కిందన్నారు. ఇక ముందు కూడా కార్పొరేట్ వైద్య సేవలు ఇలాగే అందిస్తామని, ప్రజల సహాయ సహకారాలు కూడా అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న డాక్టర్ కాళీప్రసాద్‌రావు

Wanted ఆంధ్రజ్యోతి Classifieds Real Estate Health Jobs Beautician For Sale

WANTED
★ Wanted Marketing PRO'S for Reputed Degree College, Hanamakonda. Contact : 8801220067, 9676481370
AJW-217385

WANTED
★ హన్మకొండ, వరంగల్ లోకల్‌లో పని చేయుటకు టెలికాలర్స్, రిసెప్షనిస్ట్, సిస్టమ్ ఆపరేటర్స్ అర్జెంటుగా కావలెను. జీతం : 8,000-10,000. సంప్రః 9440414616
AJW-217387

WANTED
★ Wanted Marketing Boy and Receptionist, to work in a reputed Diagnostics Centre, Hnk & Wgl. With Good Communication Skills. Contact : 9676042002, 9700288200, 9393113929.
AJW-7648

WANTED
★ శ్రీ సాయిరాం హోమ్ కేర్ హైదరాబాద్‌లో బేబి కేర్, పేషెంట్ కేర్, ముసలి వాళ్ళను చూసుకొనుటకు ఆయాలు, నర్సులు & ఇంటిపని, వంటపనికి మనుషులు కావలెను. జీతం: 18,000/- : 9949094607, 9908454607
AJB-47

WANTED
★ జూన్‌లో ప్రారంభమయ్యే మా భారతీయ డే-కేర్, ప్లే స్కూల్, నర్సరి-2nd కి అడ్మిషన్లు జరుగుతున్నవి. 27సం॥ల వ్యాపార దృష్టి లేని స్కూల్. క్లర్క్ /ఆయా/ వాచ్‌మన్ కావలెను. సంప్ర॥ 8801066232
AJW-237152

WANTED
★ మడికొండ (ధర్మసాగర్) దగ్గరలో ఉన్న పెట్రోల్ బంక్‌లో పనిచేయుటకు మంచి ఉత్సాహవంతులైన వర్కర్స్ కావలెను. సెల్ : 8247771016, 8247771525.
AJM-12942

WANTED
★ శివకార్తికేయ హోంకేర్ నందు వృద్ధులను / పేషంట్స్‌ని / పిల్లలను చూసుకొనుటకు ఇంటి పని / వంట పని చేయుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph.: 99120 11499, 99120 11899.
AJH-003142

అర్జెంటుగా కావలెను
★ వరంగల్ MGM దగ్గరలో హోటల్‌లో పనిచేయుటకు టిఫిన్ మాస్టర్ భార్యభర్తలు కావలెను. Food + అకామిడేషన్. జీతం : 16,000/-. MG Road Wgl. సం॥ప్ర॥ 9573637686
AJW-5796

సెక్యూరిటీ గార్డ్స్ & సూపర్‌వైజర్స్ కావలెను
★ హన్మకొండ, వరంగల్ లోకల్‌లో పని చేయుటకు సెక్యూరిటి గార్డ్స్ మరియు సూపర్ వైజర్స్ కావలెను. జీతం॥ 12,000-16000. సం॥ప్ర॥ 8309693457
AJW-217384

EDUCATION
★ STUDY HALL Rs 1000 seat P.M.1st 30 seats 500 this month offer. Registration Time:- 10.00 to 5.00 pm 9391622073. Inspire Professionals, 2nd flr, MAYURI PLAZA, Kishanpura HNK
AJM-12939

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా సమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ప్రతి నాలుగు లైన్ల క్లాసిఫైడ్ ప్రకటనకు రూ. 250/- మాత్రమే. అదనపు లైనుకు రూ. 45/-

గమనిక : మీరు ఇచ్చే ప్రతీ ప్రకటనలకు 5% GST అదనంగా చెల్లించవలెను.

ప్రకటనల కొరకు సంప్రదించండి
హన్మకొండ
9985400013
8978510273
9985411677
9985411676
వరంగల్
9985406150
9985408173
జనగామ
9866431354
మహబూబాబాద్
9985418040
తొర్రూర్
9985418040
నర్సంపేట
9985418040
భూపాలపల్లి
9985401232
పరకాల
9985401232

3+2 స్కీం కలదు

సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు కార్యాచరణ రూపొందించాలి

- టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి
- హనుమకొండ సర్కిల్ విద్యుత్ అధికారులతో సమీక్ష

రాంనగర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఎన్పీడీసీఎల్ పరిధిలోని హనుమకొండ, వరంగల్, కరీంనగర్ ప్రాంతాల్లో ఇండోర్ సబ్‌స్టేషన్‌ల ఏర్పాటు కోసం కార్యాచరణ రూపొందించాలని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి అధికారులకు సూచించారు. హనుమకొండ కార్పొరేట్ కార్యాలయంలో మంగళవారం హనుమకొండ సర్కిల్ విద్యుత్ అధికారులతో సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. ప్రతీ పనిలో సాంకేతికతను అవలబించాలని సూచించారు. డ్రోన్ ద్వారా పోల్ టూ పోల్ సర్వే చేయించాలని సూచించారు. భవిష్యత్‌లో లైన్ వేసే పరిస్థితి ఎక్కడ ఉండదో అక్కడ అండర్ గ్రౌండ్‌లో కేబుల్ వేస్తామన్నారు. దేవునూరు, క్యాంతనపల్లి ప్రాంతాల్లో వేసే లైన్ల పనులను వేగవంతం చేయాలన్నారు. అత్యవసర సేవలందించే ప్రభుత్వ కార్యాలయాలకు 24 గంటలు విద్యుత్ సరఫరా ఉండేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల ఫెయిల్యూర్ కాకుండా విధిగా టాంగ్ టెస్టర్ రీడింగ్ తీసుకోవాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల రిపేరు పెంచాలని, 60 శాతం కంటే లోడ్‌పెరిగే ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచాలన్నారు. వినియోగదారులు ఎట్టిపరిస్థితుల్లో విద్యుత్ సిబ్బంది చేసే పనులను చేయకూడదని, 1912కు ఫోన్ చేసి సేవలు పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డైరెక్టర్లు అశోక్‌కుమార్, సదర్‌లాల్, తిరుపతిరెడ్డి, మధుసూదన్, సీఈలు రాజు చౌహాన్, తిరుమల్‌రావు, హనుమకొండ ఎస్ఈ మధుసూదన్‌రావు, డీఈలు, ఏడీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాలో సిబ్బంది పాత్ర కీలకం

నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయడంలో విద్యుత్ సిబ్బంది పాత్ర కీలకమని ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి అన్నారు. ఆపరేషన్, మెయింటెనెన్స్ (ఓఅండ్ఎం), ఆర్టిజన్స్ సిబ్బందితో మంగళవారం సీఎండీ ఇంటరాక్షన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. వినియోగారులతో సత్సంబంధాలు ఉండే ది కింది స్థాయి సిబ్బందికేనని, అలాంటి సమయంలో వారికి మెరుగైన సేవలందించే అవకాశం వారకే ఉంటుందని గుర్తు చేశారు. విద్యుత్‌శాఖలో కొత్త మార్పులు తీసుకొస్తున్నామని, ప్రతీ ఒక్క సిబ్బంది విద్యుత్ భద్రత ప్రమాణాలు పాటించాలన్నారు. రబీ సీజన్‌లో మెరుగైన విద్యుత్ సరఫరా అందించారని, ఖరీఫ్‌లో కూడా బాగా పనిచేయాలని సూచించారు. విద్యుత్ భద్రతకు పెద్దపీట వేస్తున్నామని, డీఈ టెక్నికల్ అధికారులను నోడల్ సెఫ్టీ ఆఫీసర్లుగా నియమించామన్నారు. టోల్‌ఫ్రీ సేవలు విస్తృతం చేశామని, ప్రతీ ఒక్క వినియోగదారుడు 1912 గుర్తుంచుకునేలా ప్రచారం చేయాలన్నారు. రూరల్ ప్రాంతాల్లో బ్రేక్ డౌన్ టీమ్‌లను ఏర్పాటు చేశామని, ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే నియామకాలు చేపడుతామన్నారు. ఆన్‌మ్యాన్డ్ వేతనాలు పెంచామని, భద్రతలో భరోసా నిచ్చేలా కోటి రూపాయల బీమా సౌకర్యం కల్పించామన్నారు. ఈ సందర్భంగా సిబ్బంది నుంచి సూచనలు, సలహాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డైరెక్టర్ అశోక్‌కుమార్, సదర్‌లాల్, ఎస్ఈ మధుసూదన్, డీఈ సాంబరెడ్డి, విజేందర్‌రెడ్డి, ఏడీఈలు, హనుమకొండ సర్కిల్ ఓ అండ్ ఎం, ఆర్టిజన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

రాజాజీనగర్ బ్రిడ్జి నిర్మాణాలు నిలిపివేయండి

- కాంట్రాక్టర్‌ను ఆదేశించిన బల్దియా అధికారులు
- 'ఆంధ్రజ్యోతి' కథనంతో కదిలిన యంత్రాంగం

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ 52, 53 డివిజన్‌ల మధ్యలో నిర్మించిన రాజాజీనగర్ బ్రిడ్జి సమీపంలో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలను వెంటనే నిలిపి వేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను బల్దియా అధికారులు ఆదేశించారు. నాలా నుంచి సక్రమంగా ప్రవహించాల్సిన మురుగు నీటిని అడ్డుకునే విధంగా నాలా మధ్యలో 15 పిల్లర్లు నిర్మించడం ఏమిటని ప్రశ్నిస్తూ పనులు నిలిపి వేయాలని ఆదేశించారు. కాగా, ఈ నెల 5న 'ఆంధ్రజ్యోతి'లో 'పేదోళ్లకు ఒక లెక్క పెద్దోళ్లకు మరో లెక్క' అనే కథనం ప్రచురితం కావడంతో అధికారుల్లో చలనం వచ్చింది. స్థానిక డివిజన్ వాసులు సైతం సమస్యను పశ్చిమ ఎమ్మెల్యేను కలిసి విన్నవించారు. దీంతో ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి స్పందించి బల్దియా అధికారులను ఫోన్‌చేసి పురమాయించినట్టు అక్కడి ప్రజలు తెలిపారు. దీంతో మంగళవారం ఇంజనీరింగ్ అధికారులు హుటాహుటిన రాజాజీనగర్‌కు చేరుకున్నారు. అక్కడ నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను వెంటనే నిలిపివేయాలని, ఒక్క ప్రొటెక్షన్ వాల్ పనులు మాత్రమే చేపట్టాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. రాజాజీనగర్ బ్రిడ్జి పనులను సందర్శించిన వారిలో బల్దియా ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, ఈఈ రవికుమార్, డీఈ సారంగం, ఏఈ మేనకలు ఉన్నారు. కాగా, బిడ్జి పనుల్లో అవకతవకలపై కథనం ప్రచురించిన ఆంధ్రజ్యోతికి రాజాజీనగర్ హెల్పింగ్ అండ్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.


పేదోళ్లకు ఒక లెక్క పెద్దోళ్లకు మరో

ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్త



వేధింపులతో వివాహిత ఆత్మహత్య

ఎల్కతుర్తి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): అత్త, భర్త వేధింపులు భరించలేక వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఎల్కతుర్తి మండలం సూరారం గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కమలాపూర్ మండలం దేశరాజ్‌పల్లి గ్రామానికి చెందిన శ్రీరామోజు రమేష్‌చారికి కరీంనగర్ జిల్లా హుజురాబాద్ పట్టణానికి చెందిన హిమబిందు (36)తో 16 ఏళ్ల కిందట వివాహం జరిగింది. వివాహ అనంతరం ఎల్కతుర్తి మండలం సూరారం గ్రామంలో బంగారం పనులు చేస్తూ అక్కడే స్థిరపడ్డారు. వీరికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. అత్త లక్ష్మి, భర్త రమేష్‌లు ఆమెను మానసికంగా వేధింపులకు గురి చేసే వారు. ఈ క్రమంలో వారి వేధింపులు భరించలేక మనస్థాపానికి గురై ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తండ్రి పంచకోటి సదానందచారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై అక్కెనపెల్లి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మృత దేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం హుజురాబాద్ సివిల్ ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.



హిమబిందు (ఫైల్)

గంజాయి విక్రయిస్తున్న యువకులు అరెస్టు

వరంగల్ క్రైం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): గంజాయి క్రయ విక్రయాలు చేస్తున్న యువకులను హనుమకొండ పోలీసులు మంగళవారం అరెస్టు చేసినట్లు ఏసీపీ దేవేందర్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. భూపాలపల్లి జిల్లాకు చెందిన మోతే మణికంఠ, కోటగిరి రోహిత్‌లు సులభంగా డబ్బులు సంపాదించేందుకు ద్విచక్రవాహనంపై ఒడిషాలో కల్మిల గ్రామానికి వెళ్లి నాగరాజు అనే వ్యక్తి వద్ద అరకిలో గంజాయి కొనుగోలు చేశారు. తమ దగ్గర ఉన్న గంజాయిని విక్రయించేందుకు ఇద్దరు నిందితుల్లో మణికంఠ అనే వ్యక్తి సోమవారం హనుమకొండకు రాగా, పోలీసులు పక్కా సమాచారంతో సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. విచారించగా తన దగ్గర గంజాయి కొనుగోలు చేసిన బాలుడితో పాటు మేకల అవినాశ్, శనిగరపు అభిలాష్, కాంతాల రాజిరెడ్డి, ఓదెల అరుణ్‌లతో పాటు వ్యాపార భాగస్వామి రోహిత్ పేర్లు వెల్లడించగా వారిని అదుపులోకి తీసుకొని అరెస్టు చేశామన్నారు. ఈ ఘటనలో ఒడిషాకు చెందిన నాగరాజుతో పాటు మణికంఠ దగ్గర గంజాయి కొనుగోలు చేసిన వడ్డెపల్లికి చెందిన తాళ్లపల్లి చిన్ను ప్రస్తుతం పరారీలో ఉన్నారన్నారు.

సందడిగా జిల్లాస్థాయి బాక్సింగ్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండ డీఎస్ఏ బాక్సింగ్ హాలులో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి బాక్సింగ్ ఎంపిక పోటీలు ప్రారంభం అయ్యాయి. ఈ వేడుకలను బాక్సింగ్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజేందర్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మెన్, ఉమెన్ విభాగంలో నిర్వహించిన పోటీల్లో 20 మంది పాల్గొన్నట్లు తెలిపారు. ఇక్కడ జిల్లాస్థాయిలో ప్రతిభ కనబర్చిన బాక్సర్లు ఈ నెల 11, 12 తేదీల్లో సికింద్రాబాద్ లాలా పేటలోని నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ బాధ్యులు, కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

వికసిత్ భారత్ పోటీల్లో ప్రతిభ

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా జరిగిన వికసిత్ భారత్ పోటీల్లో కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి శ్రీజా జాదవ్ సత్తాచాటారు. వన్ నేషన్ వన్ ఎలక్షన్ అనే అంశంపై ఢిల్లీ పార్లమెంట్‌లో జరిగిన వక్తృత్వ పోటీల్లో అనర్గళంగా మాట్లాడి దేశ స్థాయిలో గెలుపొందారు. న్యాయ నిర్ణేతలు శ్రీజా జాదవ్ ప్రతిభను గుర్తించి నెం-1గా ఎంపిక చేశారు. మంగళవారం ఢిల్లీలో జరిగిన పోటీల్లో పాల్గొని వచ్చిన శ్రీజా జాదవ్‌ను కేయూ మొదటి గేటు వద్ద కేయూ జాతీయ సేవ పథకం కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ నేతృత్వంలో అధ్యాపకులు, విద్యార్థులు స్వాగతం పలికారు. వర్సిటీలో ర్యాలీ, ప్రదర్శనలు చేపట్టారు. శ్రీజా జాదవ్‌ను గజమాల వేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీజా జాదవ్ వర్సిటీకి రాగా కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంలు పుష్పగుచ్ఛం, జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని అందచేసి అభినందనలు తెలిపారు.



శ్రీజ జాదవ్‌కు జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని అందిస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రం

ప్రహర్షకు అవార్డు

మడికొండ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): నాగపూర్‌లోని దాదాసాహెబ్ కల్మేఘ్ మెమోరియల్ డెంటల్ కళాశాల, ఆస్పత్రి ఆరో పరిశోధన అవార్డుల ప్రదానోత్సవంలో హనుమకొండకు చెందిన కేంద్రియ విద్యాలయ ఉపాధ్యాయుడు అన్నాబత్తుల వెంకన్న కుమార్తె డాక్టర్ ప్రహర్షకు పరిశోధన అవార్డు లభించింది. కళాశాల ఆడిటోరియంలో జరిగిన వేడుకల్లో పద్మశ్రీ ప్రొఫెసర్ యాదవ్ చేతుల మీదుగా ప్రహర్ష అవార్డుతో పాటు నగదు బహుమతిని అందుకున్నారు. అవార్డు రావడంపై ప్రహర్ష సంతోషంగా వ్యక్తం చేసింది.



అవార్డు స్వీకరిస్తున్న ప్రహర్ష

కొమ్మాల జాతర హుండీల ఆదాయం లెక్కింపు

మిశ్రమ బంగారం 12 గ్రాములు, వెండి 4 కిలోలు



హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న సేవాసమితి సభ్యులు

గీసుగొండ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కొమ్మాల శ్రీలక్ష్మీనరసింహస్వామి జాతర హుండీల ఆదాయాన్ని మంగళవారం రెండోసారి లెక్కించారు. హుండీల ద్వారా రూ.9,16,892, వివిధ రకాల ఆర్జిత సేవలు, అర్చనల ద్వారా రూ.6,52,266 మొత్తం రూ.15,69,158 వచ్చినట్లు ఆలయ ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు తెలిపారు. అదేవిధంగా 4 కిలోల వెండి, 12 గ్రాము ల మిశ్రమ బంగారం హుండీలలో లభించినట్లు చెప్పారు. 13 రోజులకు గాను ఈ ఆదాయం వచ్చిందని ఆయన వివరించారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ పరిశీలకుడు అనిల్‌కుమార్, ఆలయ ధర్మకర్తల ట్రస్టీ చైర్మన్ శ్రీనివాసాచార్యులు అర్చకులు కాందూరి రామాచార్యులు, ఫణీంద్ర, విష్ణు, వెంకటేశ్వర సేవాసమితి సభ్యులు పోలీసులు పాల్గొన్నారు.

కర్రెగుట్టలపైకి రాకండి

- కగార్ నుంచి రక్షణ కోసం బాంబులు అమర్చాం
- తొలిసారి ప్రకటించిన మావోయిస్టులు
- వెంకటాపురం-వాజేడు ఏరియా కమిటీ కార్యదర్శి శాంత పేరుతో లేఖ విడుదల

ములుగు/వాజేడు/ వెంకటాపురం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో మావోయిస్టులకు సేఫ్ జోన్‌గా భావిస్తున్న కర్రెగుట్టలపైకి సాధారణ పౌరులెవరూ రావొద్దంటూ మావోయిస్టులు హెచ్చరించారు. కగార్ పేరిట జరుగుతున్న దాడుల నుంచి రక్షణ కోసం గుట్ట చుట్టూ బాంబులు అమర్చామని పేర్కొన్నారు. మావోయిస్టు పార్టీ వెంకటాపురం-వాజేడు ఏరియా కమిటీ కార్యదర్శి శాంత పేరిట ఓ లేఖ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ములుగు జిల్లా పరిధిలోని వాజేడు, వెంకటాపురం మండలాలను కలుపుకుంటూ కర్రెగుట్టలు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోకి విస్తరించి ఉన్నాయి. దట్టమైన అడవులు ఉన్న ఈ ప్రాంతాన్ని మావోయిస్టు గెరిల్లా బేస్‌గా మార్చుకున్నారని, భద్రతా బలగాలు లక్ష్యంగా మందు పాతరలు అమర్చారని గతంలో పోలీసు ఉన్నతాధికారులు వెల్లడించారు. అటు భద్రాద్రి కొత్తగూడెం, ఇటు ములుగు జిల్లాను కలిపే ఈ గుట్టలు పోలీసులు, మావోయిస్టుల చర్యలు, ప్రతిచర్యలతో నిత్యం అలజడిగా మారుతుంటాయి.

పోలీసుల మాటలు నమ్మొద్దు

ఆపరేషన్ కగార్ పేరుతో పోలీసులు ఎన్‌కౌంటర్ల పేరుతో చేస్తున్న దాడుల్లో అనేక మంది పార్టీ నాయకులు, పీఎల్‌జీఏ సభ్యులతో పాటు సాధారణ ప్రజలు బూటకపు అమరులు అవుతున్నారని ఆ లేఖలో పేర్కొన్నారు. కగార్ దాడుల నుంచి రక్షణ పొందడానికి కర్రెగుట్టలపై బాంబులు అమర్చినట్లు తెలిపారు. బాంబులు అమర్చిన విషయం ప్రజలకు వివిధ రూపాల్లో తెలిపినట్లు, అయినప్పటికీ కొద్దిమంది ఆదివాసీలు, ఆదివాసీయేతరులకు పోలీసులు మాయమాటలు చెప్పి నమ్మిస్తూ, డబ్బులు ఇస్తూ ఇన్‌ఫార్మర్‌లుగా మార్చుకొని షికారు పేరుతో కర్రెగుట్టలపైకి పంపిస్తున్నారని తెలిపారు. మావోయిస్టుల రక్షణ కోసం అమర్చిన బాంబుల బారినపడి చనిపోతున్నారని, కొంత మంది గాయపడుతున్నారని అన్నారు. పోలీసుల మాటలు నమ్మి ఇన్‌ఫార్మర్‌లుగా మారొద్దని పేర్కొన్నారు.



చర్చనీయాంశంగా మావోయిస్టుల లేఖ

ఛత్తీస్‌గఢ్‌లో నిర్బంధం ఎక్కువైన క్రమంలో తెలంగాణలోకి ప్రవేశించడానికి ఈ అడవే మావోయిస్టులకు దిక్సూచి. వారికి అడ్డుకట్ట వేసేందుకు నిఘా వేసిన పోలీసులు ప్రతిక్షణం అలర్ట్‌గా ఉంటున్నారు. ఇటీవలి కాలంలో ఛత్తీస్‌గఢ్‌లో వరుసగా భారీ ఎన్‌కౌంటర్లు జరుగుతుండగా పదుల సంఖ్యలో మావోయిస్టులు ప్రాణాలు వదలుతున్నారు. చాలామంది లొంగుబాటను ఎంచుకుంటున్నారు. ఈ క్రమంలో మోస్ట్ వాంటెడ్‌గా ఉన్న మావోయిస్టు లీడర్లు తెలంగాణ దండకారణ్యంలోకి వచ్చే అవకాశాలున్నాయని ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలోనే మావోయిస్టుల పేరిట విడుదలైన లేఖ చర్చనీయాంశంగా మారింది. గతనెల 23న వెంకటాపురం మండలం ఇప్పగూడానికి చెందిన బొగ్గుల కృష్ణమూర్తి అనే వ్యక్తి ముత్యం ధార జలపాతం సమీపంలో అడవిలోకి వెళ్లగా ప్రెషర్ బాంబు పేలి తీవ్రంగా గాయపడ్డాడు. అంతకుముందు వాజేడు మండలం జగన్నాథపురానికి చెందిన ఇల్లందుల ఏసు అనే వ్యక్తి మరణించగా, వెంకటాపురం మండలం అంకన్నగూడానికి చెందిన నవీన్, చొక్కాల గ్రామానికి చెందిన డర్రా సునీత తీవ్రంగా గాయపడ్డారు. అయితే.. ఈ సంఘటనలను ఏనాడూ స్పందించని మావోయిస్టులు కర్రెగుట్టల చుట్టూ తాము మందుపాతరలు అమర్చామని తొలిసారి ప్రకటించారు. కగార్ పేరిట జరుగుతున్న దాడుల నుంచి రక్షణ కోసమే బాంబులు పెట్టామని, ఈవిషయాన్ని పలు రూపాల్లో ప్రజలకు తెలియపర్చినట్లు లేఖలో పేర్కొన్నారు. పోలీసులు అమాయక గిరిజన, గిరిజనేతరులకు డబ్బు ఆశగా చూపించి ఇన్‌ఫార్మర్లుగా మార్చుకుంటున్నారని, అటవీ జంతువుల వేట పేరుతో అడవుల్లోకి పంపించి తమ కదలికలను తెలుసుకుంటున్నారని తెలిపారు. ఈక్రమంలో తాము అమర్చిన బాంబులు పేలి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని వెల్లడించారు. ప్రజలెవరూ పోలీసుల మాటలను నమ్మి మోసపోవద్దని, కర్రెగుట్టలపైకి రావొద్దని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సమస్యలను పరిష్కరించడం లేదని ఏడాది పాలనలోనే తేలిపోయిందని మావోయిస్టు నేత శాంత ఆ లేఖలో ప్రస్తావించారు. ఆరు గ్యారెంటీలతోపాటు ఏడో గ్యారెంటీగా ప్రజాస్వామ్య పునరుద్ధరణ చేస్తామని ప్రకటించి, ఒక్కటి కూడా నెరవేర్చలేదని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో ప్రజల ఆస్తులకు రక్షణ లేకుండా పోయిందని, భూస్వాములు, పెట్టుబడిదారుల ప్రయోజనం కోసం ప్రజల ఆస్తులను బలవంతంగా గుంజుకుంటున్నారని విమర్శించారు.

బాంబు డిస్పోజల్‌తో కర్రెగుట్టలపై తనిఖీ

- ప్రజలను ఇన్‌ఫార్మర్లనడం సరికాదు
- ములుగు ఎస్పీ శబరీశ్

ములుగు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టులు బాంబులు అమర్చిన కర్రెగుట్టల వద్ద భద్రతా చర్యలను పటిష్ఠం చేస్తున్నామని, బాంబు డిస్పోజల్ టీమ్‌లతో నిత్యం తనిఖీలు జరుపుతూ తొలగిస్తామని ములుగు జిల్లా ఎస్పీ శబరీశ్ తెలిపారు. సరిహద్దు గ్రామాల ప్రజలు ఆందోళనకు గురికావొద్దని, ఎవరికైనా బాంబుల ఆనవాళ్లు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈమేరకు మంగళవారం మీడియాకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. మావోయిస్టు పార్టీ పూర్తిగా తుడిచిపెట్టుకుపోతోందని, ఉనికిని కాపాడుకునేందు కోసం కర్రెగుట్టల వద్ద ప్రెషర్ బాంబులు అమర్చారని తెలిపారు. అటు ఛత్తీస్‌గఢ్, ఇటు తెలంగాణ సరిహద్దు గ్రామాల ప్రజలు అటవీ ఉత్పత్తుల సేకరణే జీవనాధారంగా బతుకుతున్నారని, ఈక్రమంలో బాంబులు పేలి ప్రమాదానికి గురవుతున్నారని తెలిపారు. వారిని ఇన్‌ఫార్మర్లంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మావోయిస్టుల చర్యలను పౌరహక్కుల సంఘాలు ఖండించాలని కోరారు.



ఎండలవేళ పశువులు జాగ్రత్త

- అధిక ఉష్ణోగ్రతలతో మూగజీవాలకు ప్రమాదమే..
- పశుపోషణలో యజమానులు మెళకువలు పాటించాల్సిందే

ఖానాపురం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో మనుషులే కాదు మూగజీవాలు కూడా వడదెబ్బకు గురవుతుంటాయి. ఎండల వేళ పశుపోషణలో మెళకువలు పాటించకపోతే వాటి ప్రాణానికి ప్రమాదమే. యజమానులకు నష్టమే మిగులుంది. అధిక ఉష్ణోగ్రతలు, గాలి ప్రసరణ సరిగా లేకపోవడం, పాకల్లో అధిక సంఖ్యలో జీవాలను కిక్కిరిసి ఉంచడం, నీళ్ల అందుబాటులో లేకపోవడం వల్ల పశువులు, గొర్రెలు, మేకలు వడ దెబ్బకు గురవుతాయి. వడదెబ్బకు గురైన పశువులు క్రమంగా నీరసించి బలహీనంగా మారుతాయి. వాటి చర్మం పొడిబారుతుంది. పశువుల సరిగా నడవలేక తూలుతూ ఉంటాయి. జీవక్రియ తగ్గిపోయి ఆకలి మందగిస్తుంది. దీంతో ఆహారం తక్కువగా తీసుకుంటాయి. పశువులు ఎదకు రాకపోగా చూడికట్టే అవకాశాలు తగ్గిపోతాయి. రోగ నిరోధక శక్తి తగ్గడం వల్ల ఇతర వ్యాధులు, పరాన్న జీవులు ఆశించే అవకాశం ఉంటుంది. చూడి పశువుల్లో గర్భస్రావాలు సంభవిస్తాయి, ఎండ వేడిమికి దాణ సరిగా తినక పోవడం మూలంగా పాల దిగుబడి తగ్గిపోతుంది. ఎండ నుండి పశువులను రక్షించుకుంటేనే పాడి పోషణ లాభదాయకంగా ఉంటుంది.

పాకల్లో చల్లదనం కోసం ఏర్పాట్లు

పశువుల పాకల్లో పైకప్పులకు తెల్లరంగు వేసి ఆపై గడ్డి, తాటి, కొబ్బరి వంటి ఆకుల్ని పరచడం లాంటి చర్యల ద్వారా ఎండ వేడి షెడ్లలోకి ఎక్కువగా ప్రవేశించకుండా చూడవచ్చు. మధ్యాహ్న సమయంలో పాకల చుట్టూ గోతాలు, పరదాలు వేలాడదీసి వాటిని తరుచు నీటితో తడపడం మంచిది. అత్యధిక పాలిచ్చే సంకరజాతి ఆవులు, ముర్రా గేదెలకు ఫ్యాన్లను ఏర్పాటు చేయడం ఎంతో అవసరం. పశువుల పాకలను ఎప్పటికప్పుడూ శుభ్రం చేస్తూ గాలి ధారాళంగా ప్రసరించే విధంగా చూడాలి. పశువులను రోజుకు రెండు మూడు సార్లు చల్లని నీటితో కడగాలి.

టీకాలు తప్పనిసరి

ఎండాకాలంలో పశువుల్లో వ్యాధి నిరోధక శక్తి తగ్గుతుంది. దీంతో పశువులు సులువుగా జబ్బుల బారినపడే అవకాశం ఎక్కువగా ఉంటుంది. గొంతు, జబ్బవాపు, గాలికుంటు వంటి వ్యాధులు రాకుండా టీకాలను ఇప్పించాలి. అంతర పరాన్న జీవుల నిర్మూలనకు నట్టల మందులను తాగించాలి.

మెళకువలు పాటించాలి

వేసవిలో పశువులకు అందించే మేత, దాణాలో మెళకువలు పాటిస్తేనే పాడి పోషణ లాభాదాయకంగా ఉంటుంది. ఉదయం, సాయంత్రం వేళల్లో మేతకు తీసుకెళ్లాలి. వేసవి తాపంతో పశువుల్లో జీర్ణక్రియ మందగిస్తుంది. అందువల్ల సులువుగా జీర్ణించుకునే పిండి పదార్థాలైన గంజి, జావ వంటివి అందించాలి. ఎక్కువ శాతం పచ్చిగడ్డి అందించాలి. మాగుడు గడ్డి ఉంటే సంవృద్ధిగా అందించాలి. పచ్చిగడ్డిని ఉదయం, ఎండు గడ్డిని రాత్రి సమయాల్లో కత్తిరించి ఇవ్వాలి. అధిక పాలు ఇచ్చే పశువులకు దాణాతో నీటిని కలిపి ఇవ్వాలి. మినరల్ మిక్చర్, ఉప్పు కలిపిన ద్రావణం ఇవ్వడం మరీ మంచిది. అలాగే వేసవిలో పశువుల్లో తాగునీటి అవసరాలు రెట్టింపవుతాయి. చల్లని శుభ్రమైన నీటిని పశువులకు ఎప్పుడూ అందుబాటులో ఉంచాలి. నీటి తొట్లను నీడలో ఉంచాలి. సాధ్యమైనంత వరకు ఎక్కువ నీళ్లు తాగేలా చూడాలి.

పశువుల్లో వడదెబ్బ లక్షణాలు..

నివారణోపాయాలు

వడదెబ్బకు గురైన పశువుల్లో నాలుక బయట పెట్టడం, నీరు తాగకపోవడం, మేత తినకపోవడం, మూత్ర విసర్జన ఆగిపోవడం లాంటి లక్షణాలు కలిపిస్తాయి. ముట్టెపై చెమట లేకపోవడం, కళ్లలో ఎర్రటి చారలు, నెమరు వేయలేకపోవడం తదితర లక్షణాలు ఉంటాయి. ఈ లక్షణాలు పశువుల్లో కనిపించిన వెంటనే ఉప్పు, బెల్లం కలిపిన ద్రావణం తాగించాలి. నిత్యం నాలుగైదు సార్లు చల్లని తాగునీటిని అందించాలి. పశు వైద్యుడి సహాయంతో చికిత్స అందించాలి.

పశువులకు వెంటనే చికిత్స చేయించాలి

శ్రీలక్ష్మి, పశువైద్యాధికారి, ఖానాపురం



వడదెబ్బకు గురైన పశువులను వెంటనే చల్లని గాలి వచ్చే ప్రదేశంలోకి తీసుకెళ్లాలి. శరీర ఉష్ణోగ్రతను తగ్గించేందుకు పలుమార్లు నీటితో కడగాలి. చల్లని గోనె సంచిని కప్పడం లాంటివి చేయాలి. పశువైద్యుడి పర్యవేక్షణలో చికిత్స అందించాలి. వైద్యాధికారుల సలహాలు, సూచనలు పాటించాలి.

కాళేశ్వరం.. మునులు, రుషుల తపోక్షేత్రం

- భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతున్న ముక్తీశ్వరుడి సన్నిధి
- ఈ ఏడాది సరస్వతీ పుష్కరాల వైభవం



కాళేశ్వర ఆలయం

మహదేవపూర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : భక్తుల కొంగు బంగారంగా.. బ్రహ్మ విద్యల తపోక్షేత్రంగా.. ఎందరో రుషులు, మునులు తపస్సులు చేసిన పుణ్యస్థలంగా.. ఎన్నో పాతకాలను పారదోలిన శైవ క్షేత్రంగా.. వేదకాలం నుంచి స్వచ్ఛ గోదావరి తరగలతో జన్మ తరింపజేసుకున్న పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతోంది కాళేశ్వరం. బ్రాహ్మణ అగ్రహారాలుగా విశ్వ విఖ్యాతి గాంచిన మంత్రకూటం, చెన్నూరు, కాళేశ్వరం పుణ్యతీర్థ క్షేత్రాలు.. సంప్రదాయ షట్శాస్త్రాలు, పురాణ ఇతిహాసాలను పఠించి భావితరాలకు అందజేసిన జాబాలి, అగస్త్యుడు, గౌతముడు నడయాడిన కాళేశ్వరంలో గోదావరి, ప్రాణహితల మధ్యలో అంతర్వాహినిగా ప్రవహించే సరస్వతి నదికి ఈ ఏడాది పుష్కరాల వైభవం సంతరించుకుంది. వేదవ్యాస మహర్షి స్కంద పురాణంలో కాశీ ఖండంలో పేర్కొన్న సమాచారం కాళేశ్వర క్షేత్రం ప్రసిద్ధిగా నిలుస్తోంది. భారతదేశ యాత్ర ప్రారంభించిన అగస్త్య మహర్షి గోదావరి జన్మస్థానమైన నాసిక్ త్రయంబకం క్షేత్రంలో స్నానమాచరించి వ్యాస ప్రతిష్ఠ సరస్వతిని దర్శించి కాళేశ్వరంలో త్రివేణి సంగమంలో స్నానమాచారించారు. తన యాత్రకు గుర్తుగా చెన్నూరులో అగస్త్యేశ్వరస్వామి లింగ ప్రతిష్ఠ చేయించారు. నేటికీ చెన్నూరు ఆలయంలో అగస్త్యేశ్వరుడి పురాతన ఆలయంలో పూజలు కొనసాగుతున్నాయి. 400 ఏళ్లుగా అఖండ జ్యోతి దీపం వెలుగుతుండడం విశేషం. అలాంటి ఎంతో విశిష్టతలు కలిగిన ఈ పుణ్యక్షేత్రాన్ని సరస్వతీ పుష్కరాల వేళ దర్శించుకుంటే ఎంతో మంచిదని పండితులు చెబుతున్నారు. వచ్చేనెలలో సరస్వతీ పుష్కరాల వేళ కాళేశ్వరం చరిత్ర గురించి ప్రత్యేక కథనం.

- సహజ కవి బమ్మెర పోతన తెలుగులో మహా భాగవతం రాయాలనే తపనతో ఏమి తోచని పరిస్థితిలో కాళేశ్వరం అంతర్వాహిని సరస్వతి త్రివేణి సంగమంలో స్నానం చేసి శ్రీకారం చుట్టినట్టు అభినవ పోతన వానమమలై వరదాచార్యులు రాసిన పోతన చరిత్రము తెలుపుతోంది. గౌతమ మహర్షి శిష్యులకు వేద పఠనం చేస్తున్న సమయంలో మంత్ర కూటం ప్రాంతంలో కరువు కాటకాలు వచ్చాయి. తపోబలంలో ఏ రోజుకారోజు పంట పండించి శిష్యులకందిస్తే అసూయపరులు కుట్రలతో మాయా ధేనువు సృష్టించిన వేళ దర్భ కర్రతో అదిలించగా గోవు మృతిచెంది గౌతమ మహర్షికి గోహత్యా పాతకం కలిగింది. నివారణ కోసం కాళేశ్వరంలో సరస్వతీ మాతను దర్శించి శివుడి కోసం తపస్సు చేసుకుని గోదావరితో కూడిన మహాసరస్వతిని దర్శించడంతో గోహత్యా దోషం నివృత్తి కలిగిందని, అందుకు సాక్ష్యమే మంత్రకూటంలో గౌతమేశ్వరాలయమని కాళేశ్వర ఖండంలోని కథనం చెబుతోంది.
- కాళేశ్వరం క్షేత్రంలో అష్టతీర్థాలు శివుని ఎనిమిది రకాల రూపాలకు సాక్ష్యాన్ని కథలున్నాయి. కొందరు దొంగలు ప్రతి రోజు కాళేశ్వరం ప్రాంతంలో దొంగతనాలు చేసి తెల్లవారుజామున పరుగెత్తి వెళ్లేవారు. రాజులు వేసిన శిక్షలు అనుభవించి బాధపడేవారు. జాబాలితో సహా పస్తర్షులు ఎదురుపడి పాప పరిహారం కోరారు. వారు గోదావరి నీరు చల్లగానే ప్రాణాలు కోల్పోయారు. రుషులకు బ్రహ్మత్యా పాతకం కలగ్గా నివారణకు కాళేశ్వరం చేరి సరస్వతి సంగమంలో స్నానం చేసి పునీతులయ్యారట. తర్వాత కొన్నాళ్లకు రుషులు కాశీకి వెళ్లగా నాటి దొంగలే మహారాజులుగా కనిపించి రుషులను గౌరవించి ఆదరించారు. కాశీలో విద్యాలయాల్లో కాళేశ్వరం అంతర్వాహిని సరస్వతి త్రివేణి సంగమం ప్రాచుర్యాన్ని ప్రచారం చేయించారు.
- త్రేతాయుగంలో శ్రీరాముడు పంచవటిలో సీతాపహరణం జరిగిన తర్వాత భరించరాని తాపంతో ప్రయాణిస్తూ కాళేశ్వరంలో గోదావరి, ప్రాణహిత, సరస్వతి త్రివేణి సంగమంలో స్నానమాచరించి ముక్తీశ్వరుడిని పూజించారట. సుగ్రీవుని చొరవతో దేశంలోని రుషులందరిని పిలిపించి యజ్ఞయాగాలు చేయించనట్లు పురాణాలు చెబుతున్నాయి. కాళేశ్వరం నదీతీరంలో హనుమత్ తీర్థం, వీరాంజనేయస్వామి దేవాలయం, శ్రీ సీతారామ చంద్రమూర్తి ఆలయాలు అందుకు సాక్ష్యాలుగా ఉన్నాయని వేదపండితులు చెబుతున్నారు.
- ఇక శివతత్వాన్ని గ్రామీణులకు వివరించేందుకు పదకొండో శతాబ్దంలో నీలకంఠేశ్వరాద్యుడు ఎంతో కృషి చేశాడు. నారదబ్రహ్మ సూత్రాలకు వ్యాఖ్యానం రాసి.. గోదావరి పరివాహక ప్రాంతం మధ్యాచార్యుల తీరంలో సోన్‌సమీపంలో నిర్మల్‌కు చెందిన నిర్మల శంకరశాస్త్రీ నీలకంఠేశ్వర వ్యాఖ్యానానికి వివరణ, విశ్లేషణ రాశారు. ఆ గ్రంథంపై ప్రముఖ తత్వవేత్త, పూర్వ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ముందుమాట ఉపోద్ఘాతం రాయడం విశేషం. కాళేశ్వరం, చంద్రువెల్లి ప్రాంతాల్లో వేద పాఠశాలలు నెలకొల్పి వీరభద్ర పండిత శివారాధ్యులు కాళేశ్వరం సరస్వతీ క్షేత్ర మహిమలు ఎల్లవేళలా ప్రాచుర్యం పొందేలా చేశారు. కాకతీయుల సామ్రాజ్యంలో విద్యారణ్యుల శిష్య పరమాణువు కాళేశ్వరం రాజయ్యారాధ్యులు కాళేశ్వర ఖండం గ్రంథం ముద్రణలో చొరవ చూపారు. కాకతీయులు కాళేశ్వరం త్రివేణి సంగమంలో రాజు శిరం బరువుకు సమానమైన ధనం తులాపురుషదానం చేసి తరించినట్లు గయా క్షేత్రంలో లభించిన శాసనం ద్వారా తెలుస్తోంది. ఈ విధంగా సరస్వతీ అంతర్వాహినిగా ఉన్న గోదావరిలో సరస్వతీ పుష్కరాల సమయంలో స్నానం చేయడం ద్వారా పిల్లలకు విద్యా విజ్ఞానం పెరుగుతుందని, అది తమ అదృష్టమని భక్తులు భావిస్తారు.

పట్టాలు పొందిన వేళ.. ఆనంద హేల



కూతురు పట్టా అందుకున్న ఆనందంలో తల్లిదండ్రులు



విద్యార్థికి ఎంబీబీఎస్ పట్టా అందజేస్తున్న కాళోజీ వర్సిటీ వీసీ నందకుమార్‌రెడ్డి, కేఎంసీ ప్రిన్సిపాల్ రామ్‌కుమార్‌రెడ్డి, తదితరులు

- అట్టహాసంగా కేఎంసీ 61వ గ్రాడ్యుయేషన్ డే
- ఆనందంతో పులకరించిన తల్లిదండ్రుల మనసులు
- వైద్యులు అంకితభావంతో విధులు నిర్వర్తించాలి : కాళోజీ హెల్త్ వర్సిటీ వీసీ నందకుమార్‌రెడ్డి

వరంగల్ మెడికల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కాకతీయ మెడికల్ కళాశాలలో 61వ గ్రాడ్యుయేషన్ డే మంగళవారం రాత్రి అట్టహాసంగా జరిగింది. 2019 బ్యాచ్‌కు చెందిన 230మంది విద్యార్థులు ఎంబీబీఎస్ పట్టాలు అందుకోగా.. వారిని చూసి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు పులకించిపోయారు. ఆనందంతో వారిని ముద్దాడారు. తమ కలలు సాకారం చేశారంటూ ఆనందం వ్యక్తం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ నందకుమార్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యార్థులకు పట్టాలు అందజేసిన ఆయన మాట్లాడుతూ.. సమాజ ఆరోగ్య వికాసానికి వైద్యులు అంకితభావంతో విధులు నిర్వర్తించాలని, యువ వైద్యులు నిబద్ధతతో వృత్తి ధర్మాన్ని పాటించాలని సూచించారు. వైద్యుడిని దేవునితో సమానంగా కొలిచే సమాజంలో ఉన్నామన్న విషయాన్ని మరువొద్దని, ప్రజల్లో ఉన్న ఆ నమ్మకాన్ని వమ్ము చేయకుండా యువ వైద్యులు కృషి చేయాలని కోరారు. అంకితభావమున్న వైద్యులను సమాజం ఆదర్శవంతంగా చూస్తుందని అన్నారు. ఇదే కళాశాలలో పట్టాలు పొందిన అనేక మంది వైద్యులు విశిష్టమైన సేవలు అందించి ప్రజల హృదయాల్లో నిలిచిపోయారని కొనియాడారు. ఇలాంటి స్ఫూర్తి దాయకమైన కేఎంసీ నుంచి పట్టాలు పొందిన యువ వైద్యులు అలాంటి వారిని ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. అలాగే ఎంత ఎత్తు ఎదిగినా తాము చదువుకున్న కళాశాల, అధ్యాపకులు మరవకూడదని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో కాళోజీ నారాయణ రావు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ సంధ్య, డాక్టర్ రాజేశ్వరి, డాక్టర్ విజయలక్ష్మీ, డాక్టర్ మధుసూదన్, డాక్టర్ మురళీ తదితరులు పాల్గొన్నారు.



గ్రాడ్యుయేషన్ డేలో మాట్లాడుతున్న కాళోజీ వర్సిటీ వీసీ నందకుమార్‌రెడ్డి

న్యూరో సర్జన్ అవుతా..

పిన్నింటి భార్గవి



ఎంబీబీఎస్ పట్టా పొందటం ఆనందంగా ఉంది. న్యూరో సర్జన్ కావాలని లక్ష్యంగా పెట్టుకున్నా. మా అమ్మ పద్మశ్రీ, నాన్న వెంకటేశ్వర్‌రావు ప్రభుత్వ ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్నారు. చిన్నప్పటి నుంచి వారు అందించిన ప్రోత్సాహంతోనే నేను వైద్య విద్య వైపు వచ్చా. వైద్య విద్య పూర్తి చేసిన మా పెదనాన్న కొడుకు కూడా నాకు స్ఫూర్తి. భవిష్యత్‌లో ఆరోగ్య వికాసానికి సేవలందిస్తా.



కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు, తల్లిదండ్రులు

పచ్చదనానికి ప్రణాళిక సిద్ధం

- హరితహారానికి మొక్కలు సన్నద్ధం
- ముమ్మరంగా బ్యాగ్ ఫిల్లింగ్ పనులు
- మండలంలో 3.90 లక్షల మొక్కల లక్ష్యం

నెక్కొండ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): అంతరించిన అడవులకు ఊపిరి పోయడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు హరితహారం తోడ్పడనుంది. త్వరలో నిర్వహించనున్న పదకొండో విడత హరితహారం విజయవంతం చేయడానికి అధికారులు మొక్కలు సిద్ధం చేస్తున్నారు. మొక్కలు నాటడంతో అంతరించిపోతున్న అడవులకు ఊపిరి పోయడమే కాకుండా, వర్షాలు సమృద్ధిగా కురవడానికి, వాతావరణంలో కాలుష్య నివారణకు పచ్చదనం ఎంతో ముఖ్యమని ప్రజలకు అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. హరితహారం కోసం అవసరమైన మొక్కలు పెంచడానికి మట్టి, విత్తనాల సేకరణపై అధికారులు దృష్టి పెట్టారు. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా హరితహారం కోసం నెక్కొండ మండలంలోని 39 గ్రామపంచాయతీలలో నర్సరీలను ఏర్పాటుచేసి వాటిలో మొక్కలు పెంచుతున్నారు. ఈ నర్సరీలలో 3.90లక్షల మొక్కలు పెంపకం లక్ష్యంగా పెట్టుకొని ప్రణాళికలను సిద్ధంచేశామని సంబంధిత అధికారులు తెలిపారు.

6 నుంచి 8 వేల మొక్కల పెంపకం లక్ష్యం

గ్రామ పంచాయతీల పరిధిలో ఏర్పాటు చేసిన నర్సరీలో 6 నుంచి 8 వేల మొక్కలను పెంచడానికి అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకోసం నర్సరీల్లో బెడ్‌ల ఏర్పాటు, ప్లాస్టిక్ కవర్లలో మట్టి నింపే పనులు వేగవంతంగా నిర్వహిస్తున్నారు. ఇందుకు సంబంధించి నర్సరీలకు విత్తనాలను ఆరు నెలల కిందటే సరఫరా చేశారు. పూల మొక్కలు, పండ్ల మొక్కలైన బొప్పాయి, జామ, నిమ్మ, సీతాఫలం, రామాఫలం, నారింజ, నేరేడుతో పాటు వృక్ష సంబంధిత మొక్కలైన గుల్‌మోహర్, వేప, కానుగ, టెంటోఫోరం, మునగ, టెకోమా పెంచుతున్నారు.



మొక్కల కలుపు తీస్తున్న కూలీలు



ప్లాస్టిక్ కవర్లలో మట్టి నింపి మొక్కలు నాటుతున్న కూలీలు

పక్షుల నుంచి రక్షణకు..

నర్సరీల్లో పెంచుతున్న మొక్కలు ఎండ తీవ్రతనుంచి తట్టుకోవడానికి రోజుకు కనీసం మూడుసార్లు నీరు అందిస్తున్నారు. అలాగే మొక్కలకు ఎండ తీవ్రత నుంచి రక్షణకు గ్రీన్ పట్టాను ఏర్పాటు చేస్తున్నారు. దీనివల్ల ఎండ తీవ్రత నుంచి తట్టు కోవడంతోపాటు, పక్షుల నుంచి కూడా రక్షణ ఉంటుంది.

మల్టీలేయర్ పద్ధతిలో..

నర్సరీలో పెంచిన మొక్కలను హరితహారం కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ స్థలాలు, కార్యాలయాలు, దేవాలయాల అవరణలో, కాలువ, చెరువుల గట్లపై, రోడ్డు వెంట మల్టీలేయర్ అవెన్యూ ప్లాంటేషన్ చేపట్టనున్నట్లు అధికారులు అభిప్రాయం వ్యక్తం చేశారు. అలాగే నర్సరీలో పెంచిన మొక్కలను పల్లె ప్రకృతి వనాలకు సరఫరా చేస్తామన్నారు.

ఉపాధి పథకం ద్వారా..

గ్రామాల్లో వ్యవసాయ పనులు లేని సమయంలో కూలీలు జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా నర్సరీల్లో మొక్కల పెంపకం ద్వారా కూలీలకు పనులు దొరుకుతున్నాయి. నర్సరీలో పనులు చేస్తున్న కూలీలకు రోజుకు రూ.250 వరకూ కూలి పొందుతున్నారు.

మూడు నెలల్లో మొక్కలు సిద్ధం

వి.ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో, నెక్కొండ



గ్రామ పంచాయతీల పరిధిలో నిర్వహిస్తున్న నర్సరీలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి మొక్కలను హరితహారానికి సిద్ధం చేస్తున్నారు. మూడు నెలల్లో వచ్చే జూన్ నాటికి 3.90లక్షల మొక్కలు అందిస్తాం. నర్సరీల నిర్వహణ విషయంలో గ్రామ సర్పంచ్, కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు.

ఇంటింటికీ ఆరు మొక్కల పంపిణీ

యాదగిరి, గుండ్రపల్లి నర్సరీ వాచర్



వర్షాకాలం ఆరంభంలో మండలంలోని గ్రామాల్లో మొక్కలను పంపిణీ చేయడానికి సిద్ధం చేస్తున్నాం. ప్రతీ మొక్క ఎదిగేందుకు కవర్లలో మొక్కతో పాటు పెరుగుతున్న కలుపు తీస్తున్నాము. ప్రతీ ఇంటికి పండ్లు, పూల మొక్కలు ఆరు చొప్పున పంపిణీ చేస్తాం. మొక్కలు ఎండకు ఎండకుండా నిత్యం నీరు పడుతున్నాం.

ఆ ఉపాధ్యాయుడు.. ఆదర్శప్రాయుడు

- వృత్తిపై అంకితభావం.. సేవే ఆయన మార్గం
- తొమ్మిది 'ఉత్తమ' అవార్డులు అందుకున్న శ్రీనివాస్

పర్వతగిరి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఆయన ఉపాధ్యాయుడిగా వృత్తిలోనే కాదు సమాజ సేవలోనూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఎంతో మంది విద్యార్థులకు చదువు చెప్పడమే కాదు వారి తల్లిదండ్రులతో మమేకమై ఆ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు పునాది వేశారు. అంతే కాదు పర్యావరణ పరిరక్షణపైనా ప్రత్యేక శ్రద్ధ చూపడం, సామాజిక సేవాభావం కలిగిన ఆయన తొమ్మిది సార్లు ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డులు అందుకుని తనకంటూ ప్రత్యేక స్థానాన్ని నిలుపుకొన్నారు. ఆయనే వరంగల్ జిల్లా నెక్కొండ మండలం అప్పల్‌రావుపేట గ్రామానికి చెందిన మడత కొంరయ్య, మడత ఎల్లమ్మ దంపతుల కుమారుడు మడత శ్రీనివాస్. పేదకుటుంబంలో పుట్టిన శ్రీనివాస్ పాఠశాల స్థాయి విద్యాభ్యాసమంతా ప్రభుత్వ పాఠశాలలోనే పూర్తి చేశారు. బీకాం సీకేఎం కళాశాలలో 1983-86వరకు పూర్తి చేసి అనంతరం కాకతీయ యూనివర్సిటీలో 1986-88లో ఎంకాం పూర్తిచేసి 1988-89లో వరంగల్‌లోని బీఈడీ కళాశాలలో చదివారు. 1989లో డీఎస్సీకి ఎంపికై డిసెంబరు 1990లో వరంగల్ జిల్లా నెక్కొండ మండలం వెంకటాపూర్ ఎంపీపీఎస్‌లో స్పెషల్ టీచర్‌గా ఉద్యోగంలో చేరారు. అక్కడ 1992 వరకు పనిచేసి అనంతరం అదే ఏడాది ఆగస్టులో పెద్దకొర్పోల్ జడ్పీహెచ్‌ఎస్‌కు బదిలీ అయ్యారు. అక్కడ 2002 వరకు పనిచేసి అనంతరం 2006లో ఎంపీపీఎస్‌లో హెచ్‌ఎంగా పదోన్నతి పొందారు. అదే సంవత్సరంలో డోర్నకల్ మండలం పెరుమండ్ల సంకేసి జడ్పీహెచ్‌ఎస్‌కు బదిలీ అయి.. 2009 జూలై వరకు పనిచేసి పర్వతగిరి మండలంలోని ఎంపీయూపీఎస్‌కు బదిలీపై వెళ్లారు. అక్కడ 2018వరకు ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసి విద్యారంగ అభివృద్ధికి తోడ్పాటునందించారు. జూలై 2018లో అదే మండలంలోని బూర్గుమల్ల ఎంపీయూపీఎస్‌కు బదిలీ అయి హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్నారు. ఇలా 15 సంవత్సరాల పాటు ఉపాధ్యాయునిగా, 20 ఏళ్ల పాటు ప్రధానోపాధ్యాయునిగా వివిధ పాఠశాలల్లో పనిచేసి తనదైన ముద్రను వేసుకున్న ఆయన ఈ నెలాఖరులో పదవీవిరమణ పొందబోతున్నారు.

వృత్తిలోనే కాదు.. సేవల్లోనూ అంకితభావం..

ప్రభుత్వ పాఠశాలలు మూతపడుతున్న సమయంలో విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి, వారికి అవగాహన కల్పించి మరీ పాఠశాలలను కాపాడడంలో శ్రీనివాస్ కీలక భూమిక పోషించారు. ప్రధానంగా బస్సు మార్గంలేని తండాలలో కొంత వరకు సొంత ఖర్చులు వెచ్చించి ప్రైవేటు వాహనాల ద్వారా పిల్లలను స్కూల్‌కు రప్పించారు. 35 ఏళ్ల ఉపాధ్యాయ జీవితంలో ఏ రోజు కూడా గైర్హాజరైన దాఖలాలులేవని తోటి ఉపాధ్యాయులు చెబుతున్నారు. అత్యవసరమైతే చట్టపరమైన సెలవుతీసుకుంటారు. అంతేకాదు.. ఏదైనా రోజు ఒక్క నిమిషం ఆలస్యమైనా.. సగం పూట సెలవు పెట్టి మరీపాఠాలు బోధించి వెళ్తారట. పేద విద్యార్థులకు ఉన్నత చదువుల కోసం అతను అందించే ఆర్థిక సహకారాలు, విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి పాఠశాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించడం అందరినీ ఆకట్టుకుంటుంది. ఒక్కో సందర్భంలో పాఠశాల అభివృద్ధి కోసం తన సొంత డబ్బును ఖర్చుచేయడమే కాకుండా గ్రామస్థులు, నాయకులతో మాట్లాడి నిధులు సేకరించారు. ఇక పర్యావరణ హితం కోసం కృషి చేయడంతో పాటు.. తోటి ఉపాధ్యాయులను కూడా ఆ దిశగా నడిపిస్తున్నారు. తాను పనిచేసిన పాఠశాలల్లో పచ్చదనం, పరిశుభ్రత కోసం పలు కార్యక్రమాలు చేపట్టారు.

అందుకున్న అవార్డులు..

మడత శ్రీనివాస్ అందించిన సేవలకు గాను విద్యాశాఖ గుర్తించి అనేక అవార్డులు అందించింది. ఇందులో ప్రధానంగా 2001 సంవత్సరంలో నర్సంపేట డివిజన్ స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడును అవార్డును ప్రతిభా సేవా సంస్థ ఆధ్వర్యంలో అందుకున్నారు. 2011 సెప్టెంబరు 5న జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా కలెక్టర్ అవార్డు అందజేశారు. 2012లో పర్వతగిరి మండలంలో బెస్ట్ హెచ్‌ఎంగా మారీ స్వచ్ఛంద సంస్థ అవార్డు ప్రదానం చేసింది. అలాగే 2019 సెప్టెంబరులో మరోసారి జిల్లా స్థాయి అవార్డు అందుకున్న శ్రీనివాస్ 2022లో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల స్థాయిలో ఎంఈవో నుంచి ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. 2023 సెప్టెంబరులో కలెక్టర్ నుంచి జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు అందుకున్నారు.



శ్రీనివాస్ (ఫైల్)



2023లో కలెక్టర్ నుంచి అవార్డును అందుకుంటున్న శ్రీనివాస్ (ఫైల్)



ప్రస్తుతం శ్రీనివాస్ విధులు నిర్వర్తిస్తున్న బూర్గుమల్ల పాఠశాల

కొనుగోలు కేంద్రాల ప్రారంభం ఎప్పుడో?



కల్లాల్లో ఆరబోసిన ధాన్యం

స్టేషన్‌ఘన్‌పూర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో వరికోతలు ప్రారంభమైనప్పటికి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోవడంతో మండల రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల వారిగా వానకాలంలో ఏర్పాటు చేసిన సెంటర్ల వద్దకు రైతులు ధాన్యంను తీసుకువచ్చి కుప్పలుగా పోసుకున్నారు. మండలంలోని విశ్వనాథపురం, తానేధార్‌పల్లి, అక్కపల్లిగూడెం, ఇప్పగూడెం, చంద్రుతండా గ్రామాల్లో గత కొన్ని రోజులుగా వరికోతలు ప్రారంభమైనప్పటికి సంబంధిత అధికారులు మాత్రం ఐకేపీ, పీఏసీఎస్, ఓడీసీఎంఎస్ కొనుగోలు కేంద్రాలను మాత్రం ప్రారంభించలేదు. అధికారులు వెంటనే చొరవ చూపి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.

సంక్షేమ పాలనే బీజేపీ ధ్యేయం



బీజేపీ జెండా ఎగురవేస్తున్న అధ్యక్షుడు సౌడ రమేశ్

బీజేపీ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేశ్

జఫర్‌గఢ్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : సంక్షేమ పాలన అందించడమే కేంద్రంలోని బీజేపీ సర్కార్ ధ్యేయమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేశ్ అన్నారు. మంగళవారం జఫర్‌గఢ్‌లో పార్టీ జెండావిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ దేశ ప్రగతి, ప్రజా సంక్షేమం కోసం ప్రధాని మోదీ ప్రభుత్వం వివిధ పథకాలు, కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ప్రజలు మోదీ పాలన కోరుకుంటున్నారన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. బూత్ స్థాయి నుంచి పార్టీని పటిష్టవంతం చేసేందుకు కలిసి కట్టుగా కృషి చేయాలన్నారు. కాగా, మండలంలోని తిమ్మంపేటకు చెందిన పలువురు మహిళలు బీజేపీ జిల్లా అధ్యక్షుడు రమేశ్ సమక్షంలో పార్టీలో చేరినట్లు ప్రకటించారు. సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు కోరుకొప్పుల నాగేశ్ గౌడ్, జిల్లా కన్వీనర్ అంజిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు దేవర ఎల్లయ్య, జిల్లా, మండల నేతలు నవీన్‌రెడ్డి, తిరుపతి, సురేశ్ గౌడ్, ఇల్లందుల సారయ్య, గడ్డం రాజు, మదన్‌మోహన్, శ్వేత, సింగారపు రమేశ్, సాయిరాం, మారపల్లి రవి, పవన్ యాదవ్, చంద్రమౌళి, గోపాల్, ఎల్లాచారి, పాల్గొన్నారు.

• స్టేషన్‌ఘన్‌పూర్ : వేలాదిమంది దళితులకు ఉపాధి కల్పించే లెదర్‌పార్కు పునరుద్ధరణపైన ఎమ్మెల్యే కడియం శ్రీహరి దృష్టిసారించి చిత్తశుద్ధి చాటుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేష్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం గరీబ్ కళ్యాణ్ అన్న యోజన పథకం వాల్ పోస్టర్లను అవిష్కరించి మాట్లాడారు. దేశంలో రేషన్‌కార్డులు కల్గిన ఉన్న ప్రతీ పేదవాడికి 5కిలోల చొప్పున రేషన్ బియ్యం కేంద్ర ప్రభుత్వం ఇస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వం కేవలం అదనంగా ఒక్క కిలో బియ్యం మాత్రమే ఇస్తూ తాము ఇస్తున్నామని చెప్పుకోవడం సరికాదన్నారు. బీజేపీ పేదల పక్షపాతిగా పనిచేస్తోదని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండలా ధ్యక్షుడు సట్ల వెంకటరమణ, ఇనుగాల యుగేంధర్‌రెడ్డి, బూర్ల విష్ణు, కత్తుల రాజు, క్రిష్ణమూర్తి, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ తోనే అభివృద్ధి సాధ్యం

జనగామ రూరల్ : బీజేపీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు అరుట్ల ధశమంత్‌రెడ్డి అన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు లద్దునూరి మహేశ్ అధ్యక్షతన మంగళవారం జనగామ జిల్లా కేంద్రంలోని ఓ వేడుకల మందిరంలో క్రియాశీల సభ్యుల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా దశమంత్‌రెడ్డి హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు దొంగ హామీలను ఇచ్చి అధికారంలోకి రావడం జరిగిందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఏ ఒక్కటి కూడా పూర్తి స్థాయిలో అమలు చేయలేదని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తుందన్నారు. దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు మోడీ నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. బీజేపీ బలోపేతం కొరకు ప్రతి ఒక్క కార్యకర్త సైనికుడిగా పని చేయాలన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ పార్టీ సత్తా చాటి కాంగ్రెస్ పార్టీ తగిన బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో కొంతం శ్రీనివాస్, మార్క ఉపేందర్, నామాల మహేందర్, మరపాక అనిల్, కీర్తి వెంకటేశ్, కిరణ్, సిద్దులు, మహేశ్, అనిల్, సంతోశ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నేత ఆరుట్ల దశమంత్ రెడ్డి

కడియాన్ని విమర్శిస్తే ఊరుకోం

డీసీసీ కార్యదర్శి మంద రమేశ్

జనగామ రూరల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కడియం శ్రీహరిని విమర్శిస్తే ఊరుకునే ప్రసక్తే లేదని డీసీసీ కార్యదర్శి మంద రమేశ్ హెచ్చరించారు. మంగళవారం జనగామలో ఏర్పాటు చేసిన సమావేశంలో రమేశ్ మాట్లాడుతూ జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి కడియం శ్రీహరిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరైనది కాదన్నారు. పల్లా రాజేశ్వర్ రెడ్డి, తాటికొండ రాజయ్య మతి భ్రమించి ఇష్టమొచ్చినట్లు వ్యాఖ్యలు చేసున్నారన్నారు. పల్లా రాజేశ్వర్‌రెడ్డి డబ్బులు ఎగజల్లి ఎన్నికల్లో గెలుపొందాడన్నారు. కడియం శ్రీహరి ఎక్కడ భూమి కబ్జా చేశారో నిరూపించాలని సవాల్ విసిరారు. లేని పక్షంలో బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు డి.అంజిరెడ్డి, రచ్చ సోమనాథ్, జీడికంటి రాజ్‌కుమార్, సూర్యప్రకాశ్, మడికంటి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

దేవాదాయ భూములకు హద్దులు నిర్ణయించాలి

చిలుపూర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని చిలుపూర్ గుట్ట దేవస్థానం సమీపంలో ఆక్రమణకు గురవుతున్న దేవాదాయ శాఖ, ప్రభుత్వ భూములను గుర్తించి హద్దులు నిర్ణయించాలని వెంకటాద్రిపేట మాజీ ఎంపీటీసీ ఎన్నకూస కుమార్ అధికారులను డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం వెంకటాద్రిపేటలో ఆయన మాట్లాడారు. ఇటీవల భూముల ధరలు విపరీతంగా పెరగడంతో చిలుపూర్ గుట్ట దిగువన ఉన్న దేవస్థానం, ప్రభుత్వ భూములపై అక్రమదారులు కన్నేశారని, రెవెన్యూ అధికారుల అండదండలతో వాటిని అక్రమపట్టాలు చేయించుకుని కబ్జాకు పాల్పడ్డారని ఆరోపించారు. ఈ విషయంలో స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరితో పాటు, జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టిసారించి ఆక్రమణకు గురైన భూములను గుర్తించి అట్టి పట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ఆంజనేయ స్వామి గుడికి మైక్ సెట్ అందజేత

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): శివునిపల్లి పట్టణ అభయాంజనేయ స్వామి గుడికి దాతలు బూర్ల సత్తెమ్మ, కొమురయ్య కుటుంబ సభ్యులు మంగళవారం మైక్ సెట్ బహూకరించారు. ఆలయంలో నిత్యం భక్తులకు భక్తి పాటలు వినిపించేందుకు మైక్ సెట్ అందించామని దాతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బూర్ల విష్ణు, తోట సురేందర్, కె.శరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లి ఉత్సవాలకు ఆలయం ముస్తాబు

ఉత్సవాలకు హాజరు కానున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇప్పగూడెం గ్రామంలో నేటి (బుధవారం) నుంచి జరుగనున్న పెద్దమ్మతల్లి ఉత్సవాలకు ఆలయంను ముస్తాబు చేశారు. ఆలయ చైర్మన్ పిట్టల శ్రీనివాస్ ఆధ్వర్యంలోని కమిటీ భాద్యులు మంగళవారం ఉత్సవాల ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఆలయం అవరణలో మొదటిరోజు హోమం పూజ, పెద్దమ్మతల్లికి బోనాలు సమర్పించడం జరుగుతుందన్నారు. రెండవ రోజు గురువారం పెద్దమ్మతల్లిని భక్తులు దర్శించుకోవడంతో పాటు, బలిపూజ ఉంటుందని తెలిపారు. నేటి ఉత్సవాలకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిధిగా హాజరు కానున్నారని తెలిపారు. కార్యక్రమంలో కమిటీ భాద్యులు పిట్టల శ్రీనివాస్, లింగనబోయిన వెంకటేశ్వర్లు, అన్నెపు యాకయ్య, మత్స్య సోసైటీ భాద్యులు లింగనబోయిన అశోక్, తోడెంగుల ఐలయ్య, అన్నెపు రాములు పాల్గొన్నారు.

మిల్లర్లు నిబంధనలు పాటించాలి : ఎమ్మెల్యే పల్లా

జనగామ రూరల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాలలో మిల్లర్లు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని శామీర్‌పేటలో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో ఐకేపీ సెంటర్లు దేశంలోనే అత్యుత్తమంగా పారదర్శకంగా కొనసాగుతున్నాయన్నారు. రైతులు తేమ, తాలు లేకుండా ధాన్యాన్ని మార్కెట్‌లో విక్రయించి మద్దతూ ధర పొందాలన్నారు. మిల్లర్లు ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్, మాజీ ఎంపీపీ మేకల కళింగ రాజు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

ఉన్నత పాఠశాలకు కంప్యూటర్ల అందజేత

చిలుపూర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని చిలుపూర్ జడ్పీ ఉన్నత ఉన్నత పాఠశాలకు మాకీన్ ఎనర్జీ కంపనీ ప్రతినిధులు రూ 2 లక్షల విలువ గల కంప్యూటర్లతో పాటు, ప్రింటర్లను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా కంపెనీ కమర్షియల్ హెచ్‌ఆర్ మేనేజర్ సుధీర్ కుమార్ మాట్లాడుతూ, స్వచ్చంద సంస్థలు అందిస్తున్న సహకారాన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు వినియోగించుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు శ్రీనివాస్, సముద్రాల శ్రీదేవితో పాటు, ఉపాధ్యాయులు విజేందర్, వెంకటేశ్వర్లు, విక్రమ్, యాదగిరి, గోపాలకృష్ణ, జుబేదా, దుర్గ, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ గుడి నిర్మాణానికి విరాళం

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): డివిజన్ కేంద్రం స్టేషన్ ఘన్‌పూర్‌త తిరుమల నాథస్వామి దేవాలయ ఆవరణలో నిర్మిస్తున్న హనుమాన్ గుడి నిర్మాణానికి మంగళవారం గౌరిశెట్టి శ్రీనివాస్, లత దంపతులు రూ.25000లు, పి.భీమ్‌రాజ్, కవతి దంపతులు రూ.5016లు పూజారి రాముకు విరాళంగా అందించారు. హనుమాన్ గుడి పిల్లర్ల ఏర్పాటు కోసం విరాళం ఇచ్చినట్టు వారు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ బాధ్యులు కలకోట రంగాచారి, శేషాచారి, యాద శ్రీనివాస్, తెల్లాకుల రామకృష్ణ, ఎం.రవీందర్, నరేందర్, యాద శ్రీనివాస్, ఆంజనేయులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పిల్లలకు వైద్య పరీక్షలు

స్టేషన్‌ఘన్‌పూర్‌టౌన్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): స్టేషన్ ఘన్‌పూర్ హైస్కూల్ ఆవరణలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలకు చెందిన పిల్లలను పీహెచ్‌సీ వైద్యుల బృందం వైద్య పరీక్షలు నిర్వహించింది. కుటుంబ సంక్షేమశాఖ రాష్ట్రీయ బాలల ఆరోగ్య కార్యక్రమం కింద చేపట్టిన కార్యక్రమంలో డాక్టర్ మన్సూర్ ఆధ్వర్యంలో 121 ఒమంది పిల్లలను పరీక్షించారు. శిశువుల మానసిక, శారీరక ఎదుగుదల, లోపాలు పరిశీలి ంచారు. వైద్య శిబిరాన్ని ఘన్‌పూర్ క్లస్టర్ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుధీర్ ఆకస్మిక తనిఖీ చేశారు. సిబ్బందికి తగిన సూచనలు అందించారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ పద్మజ, డాక్టర్ అజయ్‌కుమార్, శ్రీనాథ్, ఆఫ్రీన్, మౌనిక, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంధ్యారాణి, టీచర్ రాణి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలను తొలగించాలి

జనగామ రూరల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లా కేంద్రంలోని ధర్మకంచ మినీ స్టేడియం ఓపెన్ జిమ్ సమీపంలో అక్రమ నిర్మాణాలను తొలగించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఎం నాయకులు అక్రమ నిర్మాణ ఇండ్లను సందర్శించారు. ఈ సందర్భంగా ప్రకాశ్ మాట్లాడుతూ మినీ స్టేడియం సమీపంలో గత ప్రభుత్వం ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేసిందని మిగతా స్థలంను కొందరు వ్యక్తులు రాత్రికి రాత్రే రేకులతో ఇండ్లను నిర్మించారన్నారు. అధికారులు స్పందించి విచారణ చేపట్టి అక్రమ నిర్మాణాలను తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బొట్ల శ్రావణ్, పల్లెర్ల లలిత, శ్రీకాంత్ పాల్గొన్నారు.

పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలి

జనగామ రూరల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం సీపీఎం నాయకులు జనగామ జిల్లా కేంద్రంలోని నెహ్రూ పార్కు వద్ద కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ప్రకాశ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిత్యవసర ధరలను రోజు రోజుకు పెంచడం వల్ల సామన్యులపై భారం పడుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే పెంచిన ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భూక్య చందు నాయక్, పల్లెర్ల లలిత, మంగ బీరయ్య, శ్రీకాంత్, వెంకటేశ్, గంగరబోయిన మల్లేశ్, సౌందర్య పాల్గొన్నారు.

తిరుమలనాథ స్వామి ఆలయం చైర్మన్‌గా నీల నర్సింహులు

స్టేషన్‌ఘన్‌పూర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీ తిరుమలనాథ స్వామి ఆలయ చైర్మన్‌గా మండల కేంద్రానికి చెందిన నీల నర్సింహులు నియామకమయ్యారు. ఈ మేరకు ఎమ్మెల్యే కడియం హన్మకొండలోని ఆయన నివాసంలో నూతన కమిటీ నియామక పత్రాన్ని సభ్యులకు అందించారు. కమిటీ చైర్మన్‌గా నీల నర్సింహులు, వైస్ చైర్మన్‌గా తాటికొండ యాదగిరి, కమిటీ సభ్యులుగా గట్టు ప్రశాంత్, లక్ష్మినారాయణ, మునిగెల కుమారస్వామి, గోనెల ఎల్లయ్య, చేరిపల్లి రాములు, గుంటి శేఖర్, గట్టు శ్రీవాణి, గౌరిశెట్టి శ్రీనివాస్‌లు నియామకమయ్యారు. రెండేళ్ల పాటు కమిటీ బాధ్యతలు నిర్వర్తించనున్నారు. కార్యక్రమంలో నాయకులు సీహెచ్ నరేందర్ రెడ్డి, చింత ఎల్లయ్య, చింత జాకబ్, నీల రాములు, స్వామినాయక్, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూములను ఆక్రమిస్తే కఠినచర్యలు

చిలుపూర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆధీనంలో ఉన్న ఆలయ భూములను ఆక్రమిస్తే కఠినచర్యలు తప్పవని తహసీల్దార్ సరస్వతి, ఈవో భాగం లక్ష్మీప్రసన్న హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలోని చిలుపూర్ గుట్ట బుగులు వేంకన్న ఆలయ భూములను రెవెన్యూ సర్వేయర్ ఆఫ్ ఏడీ మన్నెంకొండ నేతృత్వంలో రెండో విడత సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, ఇటీవల ఆలయ భూములు అన్యాక్రాంతమవుతున్నట్లు వచ్చిన ప్రచారం నేపథ్యంలో వాటిని సమగ్రంగా గుర్తించి హద్దులు ఏర్పాటు చేయడం కోసం సర్వే చేపడుతున్నట్లు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ట్రస్టుబోర్డు చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, ఎమ్మారెస్ శ్రీనివాస్ నాయక్, ఎమ్మార్‌ఐ చీకటి వినీత్ కుమార్, ధర్మకర్తలు గనగోని రమేష్, తాళ్లపల్లి బుచ్చయ్య, వెంకటేశ్వర్లు, రాజు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుడి అరెస్ట్ పిరికిపంద చర్య

జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి

జనగామ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు పెట్టించి వేధించడం పిరికిపంద చర్య అని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. జనగామ జిల్లాకేంద్రానికి చెందిన తిప్పారపు విజయ్‌ను స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అక్రమంగా అరెస్టు చేయించారని విమర్శించారు. తన పై కడియం ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడారని, దానిపై స్పందించిన విజయ్ పై కేసులు పెట్టి జెలుకు పంపించడం దుర్మార్గమైన చర్య అని విమర్శించారు. జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో వందలకు పైగా బీఆర్ఎస్ కార్యకర్తలపై కడియం కేసులు పెట్టిస్తున్నాడని, ఇవి ఎంతో కాలం సాగవని విమర్శంచారు. పోలీసులు అక్రమ కేసులకు వత్తాసు పలికితే చట్టపరంగా చర్యలు ఎదుర్కోవలసి వస్తుందని హెచ్చరించారు.

ప్రజలను దగా చేస్తున్న పాలకులు

- సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రమేశ్

జఫర్‌గఢ్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దగాకోరు పాలన సాగిస్తున్నాయని సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జువారి రమేశ్ విమర్శించారు. మండలంలోని తమ్మడపల్లి(ఐ)లో సోమవారం రాత్రి సీపీఐ గ్రామ మహాసభ మంద బుచ్చయ్య అధ్యక్షతన జరిగింది. పార్టీ జెండాను తాడెం వెంకటయ్య ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా హాజరైన రమేశ్ మాట్లాడుతూ ప్రజలకిచ్చిన హామీల అమలులో పాలకులు విఫలమయ్యారన్నారు. కేంద్రంలోని బీజేపీ సర్కార్ రైతులను మభ్యపెడుతూ సబ్సిడీలను ఎత్తివేసిందన్నారు. గ్యాస్ ధరలను పెంచి సామాన్యులపై ధరల భారం మోపుతోందన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి కల్పించడంలో విఫలమైందని విమర్శించారు. ఉపాధి పథకం సక్రమంగా అమలు పరిచి కనీస వేతనాలు అమలు పరచాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను పూర్తి స్థాయిలో అమలు చేయలేక బూటకపు మాటలతో మభ్యపెడుతోందన్నారు. గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు. కాగా, సమావేశంలో గ్రామ సీపీఐ నూతన కమిటీ కార్యదర్శిగా మంద బుచ్చయ్య, సహాయ కార్యదర్శిగా బుల్లె సాయిలుతో పాటు సభ్యులుగా కదురు యాకయ్య, ఆకుల యాకయ్య, బుల్లె రాములు, భూములు, మంద లక్ష్మీ, లింగమ్మ, పోశయ్య, గోనె రాజయ్య ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు పార్టీ మండల కార్యదర్శి రమేశ్ తెలిపారు.

మార్కెట్‌లో అవినీతిపై విచారణ జరపాలి

జనగామ రూరల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): జనగామ వ్యవసాయ మార్కెట్‌లో జరుగుతున్న అవినీతిపై విజిలెన్స్ అధికారులతో విచారణ జరిపించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి భూక్య చందు నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సంఘ నాయకులు మంగళవారం కలెక్టరేట్ సూపరిటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చందు నాయక్ మాట్లాడుతూ జనగామ వ్యవసాయ మార్కెట్‌లో సీసీఐ కొనుగోలు, పల్లికాయ కొనుగోళ్లపై పెద్ద ఎత్తున అవినీతి జరుగుతుందని అధికారులు విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. సీఎంఆర్ బియ్యాన్ని ప్రభుత్వానికి ఇవ్వకుండా కోట్లు కొల్లగొట్టిన నెల్లుట్ల మణికంఠ రైస్ మిల్లును బ్లాక్ లిస్టులో పెట్టాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించి గన్ని బ్యాగులు, మౌలిక వసతులు కల్పించాలన్నారు. జిల్లాలో ఫర్టిలైజర్స్ యజమానులు కల్తీ విత్తనాలు, మందులు విక్రయించకుండా ఆధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అజ్మీరా సురేశ్, మంగ బీరయ్య, బోడ రాములు, ఉర్సుల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత

నర్మెట, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత అని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజబోయిన లక్ష్మినారాయణ అన్నారు. జై బాపు, జై బీమ్, జై సంవిధాన్ రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రలో భాగంగా మంగళవారం గుంటూరుపల్లి, అమ్మాపురం గ్రామాలలో పాదయాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మాపురం గ్రామంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి మాట్లాడారు. రాజ్యాంగాన్ని కాపాడాల్సిన బాధ్యత భారత పౌరులైన ప్రతీ ఒక్కరిపై ఉందని ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో మండల ఇంచార్జి మోటే శ్రీనివాస్, నాయకులు వలబోజు శ్రీనివాస్, చెవుల పరుశరాములు, గొల్లపల్లి బాలచందర్, భైరగోని అంజయ్య, వంగ భూపాల్‌రెడ్డి, కన్నెబోయిన రామకృష్ణ, భైరగోని సురేందర్, యాదగిరి, పండ్ల బాలనర్సు, చంద్రయ్య, ప్రజ్ఞాపురం శ్రీధర్, గంగం సుధాకర్‌రెడ్డి, కుంటి అంజయ్య, వైద్యం భూమయ్య, నర్సింగరావు, మామిడాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వీరహనుమాన్ విజయయాత్రకు తరలిరావాలి



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న వీహెచ్‌పీ సభ్యులు

జనగామ కల్చరల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): చిన్న హనుమాన్ జయంతిని పురస్కరించుకొని ఈనెల 12న నిర్వహించే వీరహనుమాన్ విజయయాత్రకు తరలిరావాలని వీహెచ్‌పీ పిలుపునిచ్చింది. ఈ మేరకు మంగళవారం జనగామ వీహెచ్‌పీ కార్యాలయంలో కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ సభ్యులు మాట్లాడుతూ శనివారం సాయంత్రం 5 గంటలకు జనగామ రైల్వే స్టేషన్ నుంచి వీరహనుమాన్ విజయయాత్ర ప్రారంభమవుతుందని, ధార్మిక పీఠాధిపతి వీరధర్మజ స్వామి, వందేమాతరం ఫౌండేషన్ చైర్మెన్ వందేమాతరం రవీందర్ ముఖ్య అతిథులుగా పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షులు మంచాల రవీందర్, ప్రధాన కార్యదర్శి మోహనకృష్ణ భార్గవ, ఉపాధ్యక్షులు బచ్చు బాలనారాయణ, చిలువేరు హర్షవర్ధన్, మాసరాజు, గుజ్జుల కుమారస్వామి, డిడిగం లక్ష్మణ్, శివరామ్, ఉల్లెంగుల రాజు, సత్యం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ చాలీసా పడిపూజ

రఘునాథపల్లి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో హనుమాన్ చాలీసా పడిపూజ కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. హనుమాన్ మాలధారణ భక్తుల జై హనుమాన్..జై శ్రీరామ్ నినాదాలతో మండల కేంద్రం మార్మోగింది. మండల కేంద్రానికి చెందిన హనుమాన్ భక్తులు కోళ్ల సందీప్, కోళ్ల రాజు తమ స్వగృహం వద్ద నిర్వహించిన హనుమాన్ చాలీసా పడిపూజ కార్యక్రమానికి హనుమాన్ మాలధారణ భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. పడి పూజ అనంతరం కోళ్ల శ్రీనివాస్ గౌడ్- అండాలు దంపతుల ఆధ్వర్యంలో హనుమాన్ మాలధారులకు బిక్ష (అన్నప్రసాదం) ఏర్పాటు చేశారు. హనుమాన్ మాలధారులు కొన్నె సతీష్, సాయికుమార్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న సీఐ ఎడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి

రఘునాథపల్లి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని రఘునాథపల్లి సిఐ ఎడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని కంచనపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సైబర్ నేరాలపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు సైబర్ నేరాలపై అవగాహన పెంచుకొని మరికొందరికి అవగాహన కల్పించడంలో ప్రధాన భూమిక పోషించాల్సిన అవశ్యకత గురించి వివరించారు. విద్యార్థులు ద్విచక్ర వాహనాలపై త్రిబుల్ రైడ్ చేసి ప్రమాదాలను కొనితెచ్చుకోవద్దని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ దూదిమెట్ల నరేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాటిచెట్టుపై నుంచి పడి

గీత కార్మికుడికి తీవ్రగాయాలు

చిలుపూర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : తాటిచెట్టుపై నుంచి జారి పడ్డ ప్రమాదంలో కల్లుగీత కార్మికునికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని నస్కల్‌లో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కోతి వీరాస్వామి వృత్తిరీత్యా కల్లుగీత కార్మికుడు. రోజూమాదిరిగానే మంగళవారం ఉదయం కల్లు గీసేందుకు గాను గ్రామ సమీపంలో ఉన్న తాటివనంలోకి వెళ్లాడు. ఓ తాటిచెట్టును ఎక్కుచుండగా నడుముకు ఉన్న మోకు ఒక్కసారిగా జారడంతో కిందపడ్డాడు. దీంతో అతడి తల, నడుముకు తీవ్రగా యాలయ్యాయి. సమాచారమందుకున్న కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం అతన్ని హన్మకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

బుగులు వేంకన్నకు సువర్ణ పుష్పార్చన



సువర్ణ పుష్పార్చన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

చిలుపూర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : అష్టదళ పాదపద్మారాధనను పురస్కరించుకుని చిలుపూర్ గుట్ట బుగులు వేంకటేశ్వ రస్వామి దేవాలయంలో సువర్ణ పుష్పార్చన కార్య క్రమాన్ని ఘనంగా చేపట్టారు. మంగళవారం దేవస్థానం ట్రస్టుబోర్డు చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, ఈవో భాగం లక్ష్మీప్రసన్న ముందుగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం 108 బంగారు పుష్పాలను (స్వర్ణాలు) స్వామివారి పాదాలకు అలంకరించారు. కార్యక్రమానికి పెద్దసంఖ్యలో హాజరైన భక్తులకు పూజా విశిష్టతను గూర్చి వివరించారు.

దేవస్థానం ఈవోపై ఫిర్యాదు చేస్తాం : బీఆర్ఎస్ నాయకులు

పాలకుర్తి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వల్మిడిలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో నకిలీ పుస్తకాల అక్రమ వసూళ్లపై ఈవోకు భాగస్వామ్యం ఉందని దేవాదాయ ధర్మాదాయ శాఖ కమీషనర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు వల్మిడి గ్రామ మాజీ సర్పంచు కత్తి సైదులు, దేవస్థానం మాజీ చైర్మన్ చెరుకు రాములు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు ముద్రించినవి ముమ్మాటికి నకిలీ పుస్తకాలేనని ఆలయ ఈవో నిర్ధారించారని అన్నారు. ఈ నెల 6న వల్మిడిలో జరిగిన శ్రీరామ నవమి సందర్భంగా నిర్వహించిన సీతారాముల కల్యాణ మహోత్సవానికి నకిలీ పుస్తకంలోని రశీదులు తీసుకున్న భక్తులను ఎలా అనుమతించారని ప్రశ్నించారు. అక్రమ వసూళ్లకు పాల్పడిన కాంగ్రెస్ నాయకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు గత ప్రభుత్వం నుంచి రూ. 50 కోట్లు మంజూరి చేసి రెండో భద్రాద్రిగా అభివృద్ధి చేశారని గుర్తుచేశారు. కళ్యాణ మహోత్సవానికి దయాకర్‌రావును ఆహ్వానించకపోవడం కక్ష సాధింపు చర్యలకు పూనుకున్నట్లుగా అర్థమవుతుందని అన్నారు. అమెరికా నుంచి వచ్చిన యశస్వినిరెడ్డి ఇక్కడి ప్రజలకు ఏ ఒక్క పని చేయకుండానే అదృష్టం వల్లనే ఎమ్మెల్యేగా గెలిచిన విషయం మరిచిపోవద్దని అన్నారు. వల్మిడి దేవాలయంలో మిగిలిన అభివృద్ధి పనులు పూర్తి చేయాలని కోరారు. సమావేశంలో వీరమల్ల రాజు, పంగ సైదులు, అంజయ్య, సోమయ్య ఉన్నారు.



పాలకుర్తిలో ప్రెస్ మీట్‌లో మాట్లాడుతున్న వల్మిడి మాజీ సర్పంచ్ సైదులు, బీఆర్ఎస్ నాయకులు

ఆంధ్రజ్యోతి సదా మీ సేవలో...
దమ్మున్న వార్తలతో అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతికి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా !
పత్రికా పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా మాకు ఫోన్ చేసి చెప్పవచ్చును. మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా వుంటారు.
సంప్రదించగలరు : జనగామ
Jangaon ACO - 9985425870, Jangaon - 1 SR - 9963609296
St. Ghanpur - SR - 8247285199
ACM - 9985411664